Bhavani Publication Trust

https://prajatheerpudaily.com

ప్రజాతీర్పు

The people's Verdict

తెలుగు జాతీయ దినపత్రిక

ప్రజా TV PRAJA TELEVISION The People's Favour

రిపోర్టర్లు కావలెను

అధునాతన సాంకేతికతతో..
ఎప్పటి వార్తలు అప్పుడు అందించేందేందుకు
మీ ముందుకు వచ్చిన

ప్రజా టెలివిజన్

యూట్యూబ్ చానల్‌లో పని చేయుటకు
రిపోర్టర్లు కావలెను. ఎలాంటి టార్గెట్లు ఉండవు.
నిత్యనూతనంగా వార్తలు, లైవ్‌లు అందించడమే మీ పని..
సంప్రదించండి: 8309979541, 9494659622

మా యూట్యూబ్ చానల్‌ను
సపోర్ట్ చేయండి
8309979541

ప్రజా టెలివిజన్ తాజా వార్తలు, అప్‌డేట్,
లైవ్ ప్రోగ్రామ్‌ల కోసం లైక్, షేర్, సబ్‌స్క్రైబ్

సంపుటి : 26 | సంచిక : 328 | హైదరాబాద్ | బుధవారం 14 అక్టోబరు 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOR



ఓడిపోయేందుకు

సిద్ధంగా ఉండండి

- 2029 ఎన్నికల్లో మట్టికరుస్తారు
- రాహుల్ గాంధీ సారథ్యంపై అమిత్ షా వ్యాఖ్య

న్యూఢిల్లీ: అక్టోబరు 13 (ప్రజాతీర్పు)

ఎన్ని ఉద్యమాలు చేసినా దేశ ప్రజలు బీజేపీ, ఎన్‌డీఏ, ప్రధాని మోదీ వెంటే ఉన్నారని, రాహుల్‌గాంధీ సారథ్యంలో కాంగ్రెస్ మరోమారు లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోవడం ఖాయమని బీజేపీ అగ్రనేత, కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. సీఈసీ జ్ఞానేశ్ రాజీనామా డిమాండ్‌లు వెల్లువెత్తాక తొలిసారిగా అమిత్ షా తాజా ఉద్యమాలపై స్పందించారు. మంగళవారం షా ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. "రాహుల్‌జీ, ఆయన మిత్రపక్ష భాగస్వాములకు ఒక విషయం చెప్పదల్చుకున్నా. 2029లో మీరంతా దారుణమైన ఓటమిని చవిచూసేందుకు సిద్ధంగా ఉండండి. 2029 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ స్పష్టమైన మెజార్టీతో గెలవబోతోంది. కాంగ్రెస్ వరసగా

-2వ పేజీలో



జంతర్‌మంతర్ వద్ద

సీజేపీ ఆందోళన

- గేటు దూకి లోపలికి ప్రవేశించి నిరసన వ్యక్తం చేసిన నేతలు
- జంతర్‌మంతర్ స్వాధీనం చేసుకున్నట్లు సీజేపీ ప్రకటన
- జ్ఞానేశ్ కుమార్ రాజీనామా జంతర్ మంతర్ వద్దే జరుగుతుంది
- సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పష్టీకరణ

న్యూఢిల్లీ, అక్టోబరు 13 (ప్రజాతీర్పు)

దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్‌మంతర్‌ను నిరసనల వేదికల జాబితా నుంచి కేంద్ర ప్రభుత్వం తొలగించడంపై కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) నేతలు, కార్యకర్తలు మంగళవారం తెల్లవారుజామున ఆందోళనకు దిగారు. పార్టీ నేతలు ఆశుతోష్ రాంకా, సౌరవ్ దాస్, అజింక్య షిండే ఆధ్వర్యంలో అక్కడికి చేరుకున్న కార్యకర్తలు పోలీసుల అడ్డంకులను దాటుకుని నిరసన తెలిపేందుకు ప్రయత్నించారు. ఇనుప గేటు, పోలీసుల బారికేడ్లను దూకి జంతర్‌మంతర్


-2వ పేజీలో

ఢిల్లీలో హిట్.. గల్లీలో ఫట్..!

ఇంత భారీ ఎత్తున ఓట్ల తొలగింపు ప్రక్రియ సాగుతుంటే, ప్రజాస్వామ్యంలో రావాల్సిన స్థాయి ఆందోళన గానీ, ప్రజా ఉద్యమం గానీ క్షేత్రస్థాయిలో కనిపించకపోవడం పెద్ద ప్రశ్నగా మారింది. సాధారణంగా ఓటర్ల జాబితాలో కొద్దిపాటి వ్యత్యాసాలు వచ్చినా వీధుల్లో ధర్నాలు చేసే రాజకీయ పార్టీలు.. ఈ ఐదేళ్లలో ఐదో వంతు ఓట్లు 22% గాల్లో కలిసిపోతున్నా వీధి పోరాటాలకు ఎందుకు దిగడం లేదు? ఢిల్లీ స్థాయిలో ప్రతిపక్షాలు , జాతీయ నేతలు నిరసనలు, ప్రెస్ మీట్లు నిర్వహిస్తున్నప్పటికీ, ఆ వేడి తెలంగాణ గల్లీలకు ఎందుకు చేరడం లేదు?

- ఓట్ల తొలగింపు పై కనిపించని స్పందన
- రాష్ట్రం లో 3 లక్షల ఓట్లు గల్లంతు
- ఓటర్లలో అవగహన లేదా?

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)



తొలగింపు ప్రక్రియ సాగుతుంటే, ప్రజాస్వామ్యంలో రావాల్సిన స్థాయి ఆందోళన గానీ, ప్రజా ఉద్యమం గానీ క్షేత్రస్థాయిలో కనిపించకపోవడం పెద్ద ప్రశ్నగా మారింది. సాధారణంగా ఓటర్ల జాబితాలో కొద్దిపాటి వ్యత్యాసాలు వచ్చినా వీధుల్లో ధర్నాలు చేసే రాజకీయ పార్టీలు.. ఈ ఐదేళ్లలో ఐదో వంతు ఓట్లు 22% గాల్లో కలిసిపోతున్నా వీధి పోరాటాలకు ఎందుకు దిగడం లేదు? ఢిల్లీ స్థాయిలో ప్రతిపక్షాలు , జాతీయ నేతలు నిరసనలు, ప్రెస్ మీట్లు నిర్వహిస్తున్నప్పటికీ, ఆ వేడి తెలంగాణ గల్లీలకు ఎందుకు చేరడం లేదు?

డబుల్ ఓట్లు ఉన్నాయా?

ఇక్కడ పార్టీల వైఖరిపై ప్రధానంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ, సీఈవోకు వినతిపత్రాలు ఇవ్వడం, బోగస్ ఫారమ్-7 అప్లికేషన్లపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయించాలని పోలీసు అధికారులను కలవడానికే పన్ను పరిమితమైంది. ప్రతిపక్ష పార్టీలు కూడా ఈ విషయాన్నీ వదిలేసాయి. నిజమైన ఓటర్లను ప్రజాసమీకరణ ద్వారా వీధుల్లోకి తెచ్చి చైతన్యవంతం చేయడంలో పార్టీలు ఘోరంగా విఫలమైందనే అభిప్రాయం ఉంది. తొలగించిన ఈ ఓటర్లు నిజంగా అర్హులైన అనే అనుమానం కూడా ఉంది. హైదరాబాద్, దాని చుట్టుపక్కల ఐటీ కారిడార్లలో నివసించే వారిలో అత్యధికులు ఏపీకి చెందిన డబుల్ ఓటర్లు, లేదా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి తిరిగి వెళ్లిపోయిన ఐటీ, వలస కార్మికులు. ఈ ఓటర్లలో మెజారిటీ వర్గం ఎన్నికల రోజున కనీసం పోలింగ్ బూత్‌కు వచ్చి ఓటు వేసే ఆసక్తి చూపించకపోవడం, లేదా స్వగ్రామాలకు వెళ్లిపోతుండటంతో.. వారి ఓట్లు మాయమైనా సాధారణ ప్రజల్లోనూ, స్థానిక క్యాడర్‌లోనూ ఎలాంటి పట్టింపు కనిపించడం లేదు.

అవగాహన కరువు?

పక్కాగా దొంగ ఓట్లను తొలగించడమే ఎస్ఐఆర్ ఉద్దేశమని భావిస్తున్న స్థానిక ప్రజలు, దీనిని తమ హక్కుల భంగంగా చూడటం లేదు. కేవలం బిఎల్ఓ అధికారులు ఇంటింటికీ రాకుండా ఫంక్షన్ హాళ్లలో కూర్చుని నామమాత్రపు తనిఖీలు చేస్తున్నారని వార్తలు వస్తున్నప్పటికీ, బాధితుడు స్వయంగా స్పందించి

-2వ పేజీలో

ఓట్లపై కాంగ్రెస్ ఫోకస్.. బూత్ స్థాయిలో స్పెషల్ ప్లాన్!

- తొలగించిన ఓటర్లను గుర్తించి.. తిరిగి చేర్పించే బాధ్యత తీసుకోండి
- సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు స్పష్టం చేసిన రాహుల్, ఖర్గే
- జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టీకరణ

న్యూఢిల్లీ, అక్టోబరు 13 (ప్రజాతీర్పు)

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ పూర్తయ్యే వరకు పూర్తి అప్రమత్తతతో ఉండాల్సిందేనని కాంగ్రెస్ హైకమాండ్ రాష్ట్ర నేతలకు స్పష్టం చేసింది. ఎస్ఐఆర్‌లో పేర్లు గల్లంతైనట్లు పేర్కొంటున్న ఓటర్లను గుర్తించి, వారి పేర్లను తిరిగి ఓటర్ల జాబితాలో చేరే?పంచేందుకు పోలింగ్ బూత్ స్థాయిలో ప్రత్యేక కార్యకర్తలను నియమించాలని ఆదేశించింది.రాష్ట్రంలోని ప్రతీ పోలింగ్ బూత్ పరిధిలో ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని, కేంద్రంలోని

-2వ పేజీలో




సైబర్ కేటుగాళ్ల వలలో చిక్కొద్దు..

క్షణిక భయంతో మోసపోవద్దు!

- తాజాగా మూడు కేసుల్లో రూ. 5.35 కోట్ల మోసం వెలుగులోకి
- డిజిటల్ అరెస్ట్‌కు లొంగిపోవద్దని హైదరాబాద్ సీపీ ద వీసీ సజ్జనర్ హెచ్చరిక

(ప్రజాతీర్పు ప్రతినిధి, రంగారెడ్డి జిల్లా)



సైబర్ నేరగాళ్ల సరికొత్త ఎత్తుగడలను తిప్పికొడుతూ ప్రజల కష్టార్జితాన్ని రక్షించేందుకు హైదరాబాద్ పోలీస్ యంత్రాంగం నిరంతరం అండగా నిలుస్తోందని, పౌరులు కూడా పూర్తి చైతన్యంతో వ్యవహరించినప్పుడే సైబర్ రహిత నగరాన్ని నిర్మించగలమని నగర పోలీస్ కమిషనర్ శ్రీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ స్పష్టం చేశారు. సోమవారం ఒక్క రోజే ముగ్గురు వ్యక్తులు సైబర్ కేటుగాళ్ల మాయలో పడి ఏకంగా దాదాపు రూ. 5.35 కోట్లు నష్టపోయారని ఆయన తెలిపారు. ఎవరూ భయాందోళనలకు లేదా అనవసరపు ఆశలకు లోనుకాకుండా కనీస విచక్షణాజ్ఞానంతో వ్యవహరిస్తే సైబర్ నేరాలను సమర్థంగా తిప్పికొట్టవచ్చని, అప్రమత్తతే ప్రజలకు అతిపెద్ద ఆయుధమని భరోసా ఇచ్చారు.తాజాగా వెలుగుచూసిన మూడు ఘటనలను విశ్లేషిస్తూ పౌరులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఓ సంస్థ అకౌంటెంట్ గుర్తుతెలియని జిప్ ఫైల్‌ను తెరవడం, సీఈఓ డీపీతో వచ్చిన నకిలీ వాట్సాప్ సందేశాలను నేరుగా ధ్రువీకరించుకోకుండా రూ. 2.70 కోట్లు బదిలీ చేశారని తెలిపారు. దాదాపు ఎనిమిది రోజుల పాటు నిధులు మళ్లుతున్నా, బ్యాంకు నుంచి లావాదేవీల సందేశాలు వస్తున్నా సంబంధిత సీఈఓ వాటిని కనీసం పరిశీలించకపోవడం వల్లనే ఈ నష్టం

-2వ పేజీలో



నిరసనల పేరిట అరాచకానికి యత్నం

- ప్రజాస్వామ్య హక్కులను కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు దుర్వినియోగం చేస్తున్నాయి
- సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో రైతుల ఇబ్బందులు పట్టించుకోవడం లేదు
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ, అక్టోబరు 13 (ప్రజాతీర్పు)

కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు గత వారం రోజులుగా ఢిల్లీలో నిరసనల పేరిట డ్రామాలాడుతూ దేశంలో అరాచకం

-2వ పేజీలో



రాష్ట్ర రోడ్లకు కేంద్రం ఊతం

- ఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌కు గ్రీన్‌సిగ్నల్
- 3 కొత్త ఆర్వోబీలు, 'పర్వతమాల'ద్వారా 5 రోప్‌వేలకు ఆమోదం

హైదరాబాద్ (తెలుగుప్రభ)

తెలంగాణలో రహదారి అనుసంధానాన్ని మెరుగుపరిచి, ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాలను తగ్గించడంతోపాటు పర్యాటక, ఆర్థిక అభివృద్ధికి ఊతమిచ్చే పలు కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులకు కేంద్రం సానుకూలంగా స్పందించింది. రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం ఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎలివేటెడ్ కారిడార్లు, జాతీయ రహదారుల విస్తరణ, ఐకానిక్ బ్రిడ్జి, రోప్‌వేలు, రైల్వే ఓవర్ బ్రిడ్జిలు సహా పలు ప్రాజెక్టులపై

-2వ పేజీలో

సైబర్ కేటుగాళ్ల వలలో చిక్కొద్దు..

క్షణిక భయంతో మోసపోవద్దు!

(మొదటి పేజీ తరువాయి)

జరిగిందన్నారు. మరో ఉదంతంలో 72 ఏళ్ల వృద్ధురాలిని మనీ లాండరింగ్ కేసు, సీబీఐ, ఈడీల పేరిట భయపెట్టి 'డిజిటల్ అరెస్ట్' డ్రామాతో 20 రోజుల పాటు కట్టడి చేసి, ఆమె బంగారాన్ని సైతం అమ్మించి రూ. 2.12 కోట్లు కాజేశారని వివరించారు. అలాగే విదేశాల్లో పనిచేసి నగరానికి వచ్చిన ఓ ఉన్నత విద్యావంతుడైన వైద్యుడు సైతం ఇన్‌స్టాగ్రామ్‌లో రోజుకు 5 నుంచి 20 శాతం లాభాలంటూ వచ్చిన ప్రచారాలను నమ్మి, నకిలీ ట్రేడింగ్ యాప్‌లో రూ. 52.51 లక్షలు పోగొట్టుకున్నారని గుర్తుచేశారు. ఉన్నత విద్యావంతులు సైతం ప్రాథమిక ఆర్థిక విచక్షణను పాటిస్తే ఇలాంటి నష్టాలను సులభంగా నివారించవచ్చని పేర్కొన్నారు. అసలు మన దేశ చట్టాల్లో ఎక్కడా 'డిజిటల్ అరెస్ట్' అనే మాటే ఉండదని, ఏ అధికారిక దర్యాప్తు సంస్థా ఆన్‌లైన్‌లో నగదు డిమాండ్ చేయదని మీడియా, సోషల్ మీడియా, ప్రెస్ మీట్లు, అడ్వైజరీల ద్వారా పోలీస్ శాఖ నిరంతరం ప్రజలను అప్రమత్తం చేస్తోందని స్పష్టం చేశారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ఉన్నతాధికారుల పేర్లతో ఫోన్లు, సందేశాలు వచ్చినప్పుడు నేరుగా సరిచూసుకోవాలని, కుటుంబ సభ్యులు ఇంట్లోని వృద్ధుల మానసిక పరిస్థితిని గమనిస్తూ వారికి నైతిక స్థైర్యాన్ని అందించాలని సూచించారు.

ఖాతాదారుల ప్రయోజనాలను కాపాడటంలో బ్యాంకులు కూడా మరింత క్రియాశీలక పాత్ర పోషించాలని, విడతలవారీగా కోట్ల రూపాయల అనుమానాస్పద లావాదేవీలు జరుగుతున్నప్పుడు ఖాతాదారులను వెంటనే అప్రమత్తం చేసే వ్యవస్థలను పటిష్ఠం చేసుకోవాలని సూచించారు.

ప్రజల రక్షణ కోసం హైదరాబాద్ పోలీస్ విభాగం చేపట్టిన 'జాగృత్ హైదరాబాద్ - సురక్షిత్ హైదరాబాద్' ప్రత్యేక డ్రైవ్ ద్వారా కేవలం ఏడాది కాలంలోనే రికార్డు స్థాయిలో దాదాపు 11,417 అవగాహన సదస్సులు నిర్వహించి, సుమారు 5.06 లక్షల మందికి నేరుగా అవగాహన కల్పించిందని గుర్తుచేశారు.

నగర పౌరులంతా సైబర్ భద్రతా ప్రమాణాలను నిత్యజీవితంలో పాటిస్తూ తమను తాము కాపాడుకోవాలని, అనుమానాస్పద లింకులు, అపరిచిత ఫైల్స్‌ను ఎట్టిపరిస్థితుల్లోనూ తెరవవద్దని పిలుపునిచ్చారు. డిజిటల్ అరెస్ట్ అనే అబద్ధపు బెదిరింపులకు ఏమాత్రం భయపడవద్దని, స్టాక్ మార్కెట్ పేరుతో వచ్చే అత్యాశ ప్రకటనలను తిరస్కరించాలని కోరారు. వాణిజ్య సంస్థలు తమ బ్యాంక్ ఎస్ఎంఎస్ అలర్ట్‌లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకోవాలని సూచించారు.

ఒకవేళ ఎవరైనా అనుకోకుండా సైబర్ మోసానికి గురైతే అధైర్యపడకుండా, అత్యంత కీలకమైన 'గోల్డెన్ అవర్' లోనే వెంటనే జాతీయ సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ '1930' కు డయల్ చేయాలని లేదా 'ఎఎవతిఎతీఱఎవ.ౌశీఱ.ఱఅ' లో ఫిర్యాదు చేయాలని సూచించారు. బాధితులకు తక్షణ న్యాయం చేసేందుకు పోలీస్ వ్యవస్థ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందని, పౌరుల అప్రమత్తతతోనే సైబర్ నేరాలకు చెక్ పెట్టవచ్చని స్పష్టం చేశారు.

జంతర్‌మంతర్ వద్ద సీజేపీ ఆందోళన

(మొదటి పేజీ తరువాయి)

ప్రాంగణంలోకి ప్రవేశించారు.ఈ సందర్భంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా నిరసనకారులు నినాదాలు చేశారు. భారత్ మాతాకీ జై, ఇంక్విలాబ్ జిందాబాద్, జైభీమ్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. 'సర్ఫరోష్ కీ తమన్నా'అనే విప్లవ కవితను కూడా పఠించారు. సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా, అజింక్య షిండేతోపాటు మరికొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీజేపీ నాయకులను ద్వారకా జిల్లాలోని జాఫర్‌పూర్ కలాన్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఓ అధికారి తెలిపారు.

కొంతమంది సీజేపీ కార్యకర్తలు అక్కడ గుమిగూడటంతో పోలీస్ స్టేషన్ లోపల, చుట్టుపక్కల భద్రతను పెంచినట్లు చెప్పారు. జంతర్‌మంతర్ తాము తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు సీజేపీ ఒక ప్రకటనలో స్పష్టంచేసింది. నిరసన తెలిపే హక్కు తమకు ఉందని వెల్లడించింది. తమ సభ్యులు బారికేడ్లను ఛేదించుకొని, జంతర్‌మంతర్ ప్రదేశంలోకి ప్రవేశించి, అక్కడ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారని వెల్లడించింది.జంతర్‌మంతర్‌ను లాక్కోవడానికి అధికారం ఎక్కడిది? జంతర్‌మంతర్ వద్ద తాము ప్రతిపాదించిన శాంతియుత నిరసన కోసం తేదీ, సమయం కోరుతూ పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు లేఖ సమర్పించిన రోజే.. అంటే అక్టోబర్ 12న ప్రభుత్వం నుంచి డీనోటిఫికేషన్ ప్రకటన వెలువడిందని అశుతోష్ రాంకా వెల్లడించారు. నిరసన తెలిపేందుకు అనుమతి కోసం అధికారులను సంప్రదించాలని ప్రభుత్వం చెప్పినట్లు గుర్తుచేశారు. అనుమతి కోరుతున్న సమయంలోనే నిబంధనలను మార్చడం ఏమిటని ప్రశ్నించారు.

నిరసన ప్రదేశంలోకి ప్రవేశంపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖ విధించిన ఆంక్షలను సౌరవ్ దాస్ తప్పుపట్టారు. ప్రజల సొత్తు అయిన జంతర్‌మంతర్‌ను లాక్కోవడానికి హోంశాఖకు అధికారం ఎక్కడదని నిలదీశారు. నిరసనలకు కేటాయించిన జంతర్‌మంతర్‌లో నిరసనలు కచ్చితంగా జరుగుతాయన్నారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసేదాకా అక్కడి నుంచే తమ పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. భారత రాజ్యాంగ ప్రతిని చూపిస్తూ.. రాజ్యాంగం మనతోనే ఉందని సౌరవ్ దాస్ అన్నారు.జంతర్‌మంతర్ వద్ద అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్ మీడియాతో మాట్లాడారు. నిర్బంధంలో ఉన్న సీజేపీ నాయకులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ 'దిశ'అనే విద్యార్థి సంఘం సభ్యులు మంగళవారం కన్నాట్ ప్లేస్ నుంచి జంతర్‌మంతర్ వరకు ర్యాలీ నిర్వహించారు. జంతర్ మంతర్‌ను తిరిగి స్వాధీనం చేసుకోవాలని పిలుపునిచ్చారు. జంతర్ మంతర్‌ను డీనోటిఫై చేయడాన్ని తప్పుపట్టారు.

ప్రతిఘటనను రద్దు చేయలేరు: దీప్కే

తమపార్టీ నేతలను పోలీసులు అరెస్టు చేయడం పట్ల సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మండిపడ్డారు. 'ప్రజల ప్రతిఘటనను మీరు రద్దు చేయలేరు'అని తేల్చిచెప్పారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ట్యాగ్ చేస్తూ మంగళవారం సోషల్ మీడియాలో దీప్కే పోస్టుచేశారు. జంతర్‌మంతర్‌లో జాతీయ జెండా ఎగరవేయడం కూడా నేరమేనా? అని ప్రశ్నించారు.నిరసన ప్రదేశం వైపు సీజేపీ సభ్యులు దూసుకెళ్లడం, ఒక గేటుపైకి ఎక్కి, త్రివర్ణ పతాకాన్ని పట్టుకుని నినాదాలు చేయడం, ఆ తర్వాత పోలీసు సిబ్బంది వారిని అదుపులోకి తీసుకున్న ఒక వీడియోను దీప్కే షేర్ చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. "నిర్ణీత నిరసన ప్రదేశాల జాబితా నుంచి జంతర్ మంతర్‌ను తొలగిస్తే, జవాబుదారీతనం కోరుతున్న ప్రజల గొంతు నొక్కేయవచ్చని ప్రభుత్వం భావిస్తే ఈ ఉద్యమం లక్ష్యాన్ని తప్పుగా అర్థం చేసుకున్నట్టే. జంతర్ మంతర్ కేవలం పటంలో ఒక ప్రదేశం మాత్రమే కాదు.

అది అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించడానికి పౌరులు గుమిగూడిన చోటు. ఏ పరిపాలనాపరమైన ఉత్తర్వు కూడా ఆ ప్రజాస్వామ్య స్ఫూర్తిని చెరిపివేయలేదు"అని దీప్కే ఉద్ఘాటించారు. సీజేపీ నాయకులు పోలీసుల నిర్బంధంలోనే ఉన్నారని, వారిని కలిసేందుకు తమ న్యాయవాదులకు అనుమతి ఇవ్వడం లేదని ఆరోపించారు. తమ నాయకులను కిడ్నాప్ చేశారని పోలీసులపై ధ్వజమెత్తారు. పోలీసులు చట్టాన్ని పాటించడం లేదని విమర్శించారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చివరకు జంతర్ మంతర్ వద్దే జరుగుతుందని పేర్కొన్నారు. 'మీకు చేతనైంది చేసుకోండి'అంటూ ప్రభుత్వానికి సవాలు విసిరారు.

రాష్ట్ర రోడ్లకు కేంద్రం ఊతం

(మొదటి పేజీ తరువాయి)

చర్చించారు. పలు ప్రతిపాదనలకు ఆమోదం, మరికొన్నింటిపై సానుకూల హామీలు లభించాయి. హైదరాబాద్‌లో అత్యంత రద్దీగా ఉండే ఎల్బీనగర్ -- హయత్‌నగర్ మార్గంలో ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాలను తగ్గించేందుకు ప్రతిపాదించిన డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌కు కేంద్ర మంత్రి ఆమోదం తెలిపినట్లు రాష్ట్ర మంత్రులు వెల్లడించారు. ఈ మార్గం పరిసరాల్లో సుమారు 54 కాలనీల్లో 10 లక్షల మందికిపైగా నివసిస్తున్నారని, నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తున్నారని కోమటిరెడ్డి వివరించారు. ఈ ప్రాజెక్టును వార్షిక ప్రణాళికలో చేర్చి ముందుకు తీసుకెళ్లేందుకు అంగీకారం లభించడంతో నగర తూర్పు ప్రాంతంలో రవాణా సౌకర్యాలు మెరుగుపడే అవకాశం ఉందన్నారు. హైదరాబాద్ -- విజయవాడ -- మచిలీపట్నం జాతీయ రహదారి ఎన్‌హెచ్ 65పై పెరుగుతున్న వాహన రద్దీని తగ్గించి, ప్రమాదాల నివారణకు రహదారి సామర్థ్యాన్ని పెంచాలని మంత్రులు కోరారు. ప్రస్తుతం నాలుగు లేన్లుగా ఉన్న రహదారిపై రద్దీ అధికమవుతోందని, ప్రమాదకర ప్రాంతాల్లో ఫ్లైఓవర్ల నిర్మాణంతోపాటు విస్తరణ పనులను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని వివరించారు. దీనిపై స్పందించిన గడ్కరీ.. నవంబర్‌లో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి, 2027 జనవరిలో 6౦2 లేన్ల విస్తరణ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ప్రయాణం, వాణిజ్య రవాణా మరింత సులభతరం కానుంది.

భాషలు నేర్చుకోండి

ఐకానిక్ బ్రిడ్జితో పర్యాటకానికి కొత్త ఊతం : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేసేందుకు ఎన్‌హెచ్ 167కెపై కృష్ణా నదికి అడ్డంగా సోమశిల -- సంగమేశ్వరం ప్రాంతంలో నిర్మించనున్న హైబ్రిడ్ కేబుల్ స్టేయిడ్, సస్పెన్షన్ తరహా ఐకానిక్ బ్రిడ్జి శంకుస్థాపన కార్యక్రమానికి హాజరుకావాలని మంత్రులు గడ్కరీని ఆహ్వానించారు. ఇందుకు ఆయన అంగీకరించినట్లు తెలిపారు. ఈ వంతెన అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నుంచి తిరుపతికి వెళ్లే ప్రయాణికులకు సుమారు 80 కిలోమీటర్ల దూరం, దాదాపు మూడు గంటల ప్రయాణ సమయం తగ్గుతుందని మంత్రులు వివరించారు. కృష్ణా నది, శ్రీశైలం జలాశయ బ్యాక్‌వాటర్స్, నల్లమల అటవీ ప్రాంతం మధ్య ఉన్న సోమశిలను ఆధ్యాత్మిక, ప్రకృతి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని పేర్కొన్నారు. పర్యాటకుల రాక పెరిగితే బోటింగ్, హోటళ్లు, రవాణా, ఆతిథ్య రంగాల్లో ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయని తెలిపారు. అలాగే హైదరాబాద్ -- శ్రీశైలం ఎన్‌హెచ్ 765పై ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ ప్రతిపాదనపైనా గడ్కరీ సానుకూలంగా స్పందించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కొత్త డీపీఆర్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మార్గంలో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతోపాటు శ్రీశైలం వెళ్లే భక్తులు, పర్యాటకుల ప్రయాణం సులభతరం కానుంది. పర్యాటక ప్రాంతాలకు సులభంగా చేరుకునేలా పర్వతమాల పథకం కింద తెలంగాణలో ఐదు రోప్‌వేల ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపినట్లు మంత్రులు వెల్లడించారు. అలాగే సేతు బంధన్ పథకం కింద మూడు రైల్వే ఓవర్ బ్రిడ్జిల (ఆర్వోబీ) నిర్మాణానికి అంగీకారం లభించిందని తెలిపారు. రైల్వే క్రాసింగ్‌ల వద్ద వాహనదారులు ఎదుర్కొనే నిరీక్షణను తగ్గించడంతోపాటు రహదారి భద్రతను మెరుగుపరిచేందుకు ఈ వంతెనలు ఉపయోగపడనున్నాయి. పుల్లూరు (ఎన్‌హెచ్ 44) నుంచి అలంపూర్, జటప్రోలు, పెంట్లవెల్లి, కొల్లాపూర్, లింగాల, అచ్చంపేట, డిండి, దేవరకొండ, మల్లేపల్లి మీదుగా నల్లగొండ (ఎన్‌హెచ్ 565) వరకు సుమారు 225 కిలోమీటర్ల రాష్ట్ర రహదారి మార్గాన్ని జాతీయ రహదారిగా అప్‌గ్రేడ్ చేయాలని మంత్రులు కోరారు. ఈ ప్రతిపాదనపై గడ్కరీ సానుకూలంగా స్పందించారు. ఈ మార్గం అభివృద్ధి చెందితే వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, వాణిజ్యం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రయోజనం చేకూరడంతోపాటు ప్రయాణ సమయం, రవాణా వ్యయాలు తగ్గనున్నాయి. రాష్ట్రంలోని 34 రహదారి పనులకు కేంద్ర రహదారి మౌలిక వసతుల నిధి (సీఆర్ఐఎఫ్) నుంచి నిధులు మంజూరు చేయాలని కోమటిరెడ్డి కోరారు. దీనిపై అవసరమైన చర్యలు తీసుకోవాలని గడ్కరీ సంబంధిత కేంద్ర అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. హైదరాబాద్--అమరావతి మధ్య గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ ప్రతిపాదనను కూడా కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు ముందుకు సాగితే రెండు రాష్ట్రాల మధ్య రవాణా అనుసంధానం మరింత మెరుగుపడనుంది.ఐఆర్‌సీ సమావేశాలకు గడ్కరీకి ఆహ్వానం : నవంబర్ 19 నుంచి 22వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరగనున్న ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ) సమావేశాలకు హాజరుకావాలని మంత్రులు కోమటిరెడ్డి, జూపల్లి.. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని ఆహ్వానించగా.. హాజరవుతానని గడ్కరీ చెప్పారు. తెలంగాణలో మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం, ప్రమాదాలను తగ్గించడం, గ్రామీణ ప్రాంతాలను ప్రధాన రహదారులతో అనుసంధానించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు కేంద్రం నుంచి లభించిన స్పందన కీలకమని కోమటిరెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ అధికారులు, రాష్ట్ర అధికారులు పాల్గొన్నారు.

ఢిల్లీలో హిట్.. గల్లీలో ఫట్..!

(మొదటి పేజీ తరువాయి)

ఫారమ్-6 దాఖలు చేసుకునే స్థితిలో లేకపోవడమే ఈ నిశ్శబ్దానికి ప్రధాన కారణం. ఢిల్లీ రాజకీయాల్లో రాజ్యాంగ పరిరక్షణ, ఓట్ చోరీ నినాదాలు ప్రచార ఆయుధాలుగా మారినప్పటికీ, తెలంగాణ క్షేత్రస్థాయిలో ప్రజలు దీనిని ఒక రొటీన్ పరిపాలనా ప్రక్రియగా చూడటమే వ్యత్యాసానికి మూలం. 70 లక్షల ఓట్ల కోత అనేది చిన్న విషయం కాకపోయినప్పటికీ, ప్రజాస్వామ్య హక్కులపై గ్రాస్ రూట్ స్థాయిలో సరైన అవగాహన కల్పించడంలో రాజకీయ పార్టీలు, పౌర సమాజం విఫలమవడమే ఈ నిశ్శబ్దానికి సంకేతం.

ఓడిపోయేందుకు సిద్ధంగా ఉండండి

(మొదటి పేజీ తరువాయి)

నాలుగోసారి ఓటమి కూపంలో కూరుకుపోనుంది. దేశ ప్రజలంతా మోదీ, బీజేపీ, ఎన్‌డీఏ వెన్నంటే ఉన్నారు. ఈ నిజాన్ని నమ్మక తప్పదు"అని అన్నారు. "ఢిల్లీలో ఒకటిన్నర కిలోమీటర్ పొడవునా 8,000 మంది జనం మధ్య 14 రాజకీయ పార్టీలతో కలిసి కదం తొక్కినంత మాత్రాన రాహుల్‌గాంధీ దేశ గొంతుకగా మారిపోరు.ప్రజాగొంతుక అనేది దేశంలో సస్యశ్యామలమైన పొలాల్లో, గ్రామాల్లో, సుదూర కొండలు, అడవులు, నదీపరివాహకప్రాంతాల్లోనూ విని?పస్తుంది. మీరు ఈ ప్రాంతాలను ఎన్నటికీ చేరుకోలేరు. బిహార్, ఉత్తర ప్రదేశ్, తమిళనాడు ఇలా చాలా రాష్ట్రాల్లో ఓటర్లు మిమ్మల్ని తిరస్కరించారు. అందుకే మీ పార్టీ తరచూ ఓడిపోతూనే ఉంది. పశ్చిమబెంగాల్, తమిళనాడు, పుదుచ్చేరి ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ ఒక్క చోట అయినా విజయకేతనం ఎగరేయలేక చతికిలపడింది"అని అన్నారు. ఓట్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, సీఈసీ జ్ఞానేశ్ వ్యతిరేక నిరసనలపై షా స్పందించారు. "తప్పుడు రాజకీయాలతో కాంగ్రెస్‌కు ఒనగూరేదేమి ఉండదు.అయినా రాహుల్ పార్టీలో కీలక నేతగా ఎదిగాక, పార్టీ అధ్యక్షుడయ్యాక, దిగిపోయి తర్వాత విపక్షనేతగా ఎంపికయ్యాక సైతం పార్టీ ఎలాంటి ఘనతలు సాధించలేదు పైగా నిరాటంకంగా ఓడిపోతోంది. మరీ ముఖ్యంగా 2024లో ఎస్ఐఆర్ మొదలయ్యాక కాంగ్రెస్ ఓటముల జోరు ఎక్కువైంది. గతంలో గద్దెనెక్కి పరిపాలించిన గుజరాత్‌లో కాంగ్రెస్ గత 41 ఏళ్లుగా ఓటమిని చవిచూస్తోంది. ఈ లెక్కన ఇకనైనా రాహుల్ ఆత్మావలోకనం చేసుకుంటే మంచిది. కృత్రిమ మీడియా కార్యక్రమాలు, అబద్ధాలను రాజధాని నడివీధుల్లో వల్లెవేసినంత మాత్రాన మీరు ప్రజల విశ్వాసాన్ని పొందలేరు. చొరబాటుదారులను ఓటర్లుగా మార్చాలని రాహుల్ చేస్తున్న ప్రయత్నాలను ప్రజలంతా గమనిస్తూనే ఉన్నారు"అని షా అన్నారు.

నిరసనల పేరిట అరాచకానికి యత్నం

(మొదటి పేజీ తరువాయి)

సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కులను రాహుల్‌గాంధీ, కాంగ్రెస్, కమ్యూనిస్టు పార?టలు దుర్వినియోగం చేస్తున్నాయని, దేశ ప్రతిష్ఠను మంటగలుపుతున్నాయని మండిపడ్డారు.మంగళవారం ఢిల్లీలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజల మద్దతు కోల్పోయి ఓడిపోతున్న కాంగ్రెస్ పార?ట...తమ ఓటమికి ఎన్నికల కమిషన్‌ను, సుప్రీంకోర్టును బాధ్యులను చేస్తోందని కిషన్‌రెడ్డి అన్నారు. గతంలో లోక్‌సభ స్పీకర్, ఆ తర్వాత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ రాద్ధాంతం చేశారని, ఇప్పుడు తమకు అనుకూలంగా తీర్పులు రాలేదని ఏకంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) కూడా గద్దె దిగాలని బెదిరింపులకు దిగుతున్నారని విమర్శించారు. వేలాది మందితో సుప్రీంకోర్టుకు ర్యాలీగా వెళ్లి సీజేఐపై ఒత్తిడి తీసుకురావడం దేశ చరిత్రలోనే మునుపెన్నడూ జరగలేదన్నారు.

రాహుల్ అసత్య ప్రచారం చేస్తున్నారు..

'ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియపై రాహుల్‌గాంధీ ఉద్దేశపూర్వకంగా అసత్య ప్రచారం చేస్తున్నారు. సర్ సర్వేలో దేశవ్యాప్తంగా 2.8 కోట్ల మంది మరణించినట్లు తేలింది. చనిపోయిన వారి ఓట్లను తొలగించకపోతే బోగస్ ఓటింగ్ జరగదా? మరో 6.3 కోట్ల మంది ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. కోటి మందికి రెండు చోట్ల ఓట్లు ఉన్నట్లు గుర్తించారు. అసలు ఆచూకీ లేని వ్యక్తుల ఓట్లు 3 కోట్ల వరకూ ఉన్నాయి. సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలోనే రెండుచోట్ల పేర్లున్న 9 లక్షల డూప్లికేట్ ఓట్లను తొలగించారు.'ఒక వ్యక్తికి ఒకే ఓటు'విధానం రాజ్యాంగబద్ధం కాదా? ప్రతి పోలింగ్ బూత్‌కు కాంగ్రెస్ పార్టీకి బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) ఉన్నారు. తప్పులుంటే క్షేత్రస్థాయిలో ఆధారాలతో ఎందుకు సరిదిద్దడం లేదు. కేరళం, తమిళనాడులలో గెలిచినప్పుడు ఎస్ఐఆర్ ఎంతో మేలు చేసిందని కాంగ్రెస్ నేత రమేశ్ చెన్నితాలే స్వయంగా చెప్పారు. మరి ఇప్పుడెందుకు వ్యతిరేకిస్తున్నారు. ఇటీవల బ్యాలెట్ పేపర్లతో జరిగిన గుజరాత్, మహారాష్ట్ర, రాజస్తాన్, త్రిపుర రాష్ట్రాల్లోని స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఘోరంగా ఓడిపోయింది..'అని కిషన్‌రెడ్డి చెప్పారు.

పెట్టుబడులకు గండి

'విపక్షాల బాధ్యతారాహిత్యం వల్ల ఒక్క రోజే రూ.40 వేల కోట్ల విదేశీ పెట్టుబడులు వెనక్కి వెళ్లిపోయాయి. దసరా, దీపావళి వంటి పండుగల సమయంలో కాంగ్రెస్ చేపట్టిన నిరసనలతో ఢిల్లీ మార్కెట్లు స్తంభించిపోయాయి. చిరు వ్యా పారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రాహుల్‌గాంధీ బారికేడ్లు ఎక్కి డ్యాన్సులు చేస్తూ అసభ్యకరంగా ప్రవర్తిస్తు న్నారు. ఓ గర్భిణీ జర్నలిస్టును, మహిళా పోలీసు అధికారులను దురుసుగా నెట్టివేయడం వారి దిగజారుడుతనానికి నిదర్శనం.

రేవంత్ ఎగిరెగిరి పడుతున్నారు..

రాహుల్‌గాంధీ గజం ఎత్తు ఎగిరితే.. సీఎం రేవంత్‌రెడ్డి తాను రెండు గజాల ఎత్తు ఎగురుతానంటూ ఎగిరెగిరి పడుతున్నారు. తెలంగాణలో బీజేపీ ధర్నాలకు పిలుపునిస్తే కనీస అనుమతి ఇవ్వకుండా ముందస్తు అరెస్టులు చేయించే రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఢిల్లీకి వచ్చి ప్రజాస్వామ్యం ఖూనీ అయిందంటూ మాట్లాడటం హాస్యాస్పదం. వర్షాల్లేక రైతులు, కరెంట్ కోతలతో పరిశ్రమలు, ప్రజలు ఇబ్బంది పడుతుంటే, వాటిని పట్టించుకోకుండా వారానికోసారి ఢిల్లీకొచ్చి రాహుల్‌ను పొగడ్తలతో ముంచెత్తి వెళ్తున్నారు..'అని కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు.

ఓట్లపై కాంగ్రెస్ ఫోకస్.. బూత్ స్థాయిలో స్పెషల్ ప్లాన్!

(మొదటి పేజీ తరువాయి)

బీజేపీ ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘం కలిసి చేస్తున్న ఓట్ల చోరీని అడ్డుకోవాలని చెప్పింది. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 'ఇండియా'కూటమి హస్తినలో చేపట్టిన 'మార్చ్ ఫర్ డెమోక్రసీ' కార్యక్రమంలో పాల్గొనేందుకు ఢిల్లీకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వివేక్, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరితోపాటు ఎంపీలు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాహుల్, ఖర్గే సర్ అంశంలో క్షేత్రస్థాయిలో కొట్లాడాల్సిన అవసరాన్ని మరోమారు నొక్కిచెప్పినట్లు తెలిసింది.

లేదంటే గెలుపోటములు ప్రభావితం

ఓటరు సవరణ ప్రక్రియలో పారదర్శకతకు తూట్లు పొడిచి, ప్రతిపక్షాలకు అనుకూలంగా ఉన్న ఓటర్లు, ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని ఈసీ ఓట్లను తొలగిస్తోందని రాహుల్ పేర్కొన్నట్లు సమాచారం. తమ అర్హతను తామే నిరూపించుకోవాల్సిన భారాన్ని పౌరులపై మోపుతూ, హడావుడిగా కొనసాగుతున్న సర్ ప్రక్రియను తేలిగ్గా తీసుకోరాదని చెప్పినట్లు తెలిసింది. ఒక్కో బూత్‌లో 2--3శాతం ఓట్లే పోయాయని తేలిగ్గా తీసుకోరాదని, వీటిద్వారా గెలుపోటములు ప్రభావితమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని రాహుల్ చెప్పినట్లు నేతలు పేర్కొన్నారు.యువత నిలదీసి ప్రశ?నస్తుందనే భయంతోనే మోదీ ప్రభుత్వం నిశ్శబ్దంగా ఫారం--6 నిబంధనల్లో అక్రమ మార్పులు చేసి, యువతను ఓటు హక్కుకు దూరం చేస్తోందన్న రాహుల్ దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సర్‌పై అవగాహన కల్పించేలా వివిధ ప్రాంతాల్లో సమావేశాలు, పాదయాత్రలు నిర్వహించాలని ఖర్గే సూచించినట్లు తెలిసింది. బూత్‌ల వారీగా తొలగించిన ఓట్లను తిరిగి చేర్చేలా ఎమ్మెల్యే, మంత్రులు బాధ్యత తీసుకోవాలని, పీసీసీ దీనిని పర్యవేక్షించాలని సూచించినట్లు తెలిసింది. జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించే వరకు ఈ పోరాటం ఆగదని.. దీనిపై అన్ని వేదికల మీద పోరాటం కొనసాగుతూ ఉంటుందని రాహుల్, ఖర్గే స్పష్టం చేసినట్లు సమాచారం.

రాష్ట్ర నేతల సంఘీభావం

సర్ అక్రమాలపై గళమెత్తి పోరాటం చేస్తున్న ఏఐసీసీ నేతలు, ఇండియా కూటమి పక్షాలకు రాష్ట్ర నేతలంతా సంఘీభావం ప్రకటించారు. దేశంలో నిష్పక్షపాత ఎన్నికలు నిర్వహించాల్సిన ఎన్నికల సంఘం అధికారంలోని బీజేపీ కుమ్మక్కైన విధానాన్ని దేశమంతా గమనిస్తోందని, ఈ అంశంలో రాహుల్ సహా కాంగ్రెస్ చేస్తున్న పోరాటంపై హర్షం వ్యక్తమవుతోందని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పేర్కొన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

జాతీయ స్థాయిలో పార్టీ చేసే ప్రతీ పోరాటానికి రాష్ట్ర నేతలంతా మద్దతుగా ఉంటారని రేవంత్ హామీ ఇచ్చినట్లు వెల్లడించాయి. రాష్ట్ర స్థాయి నుంచి బూత్‌స్థాయి వరకు సర్‌పై పోరాటం కొనసాగిస్తామని నేతలు స్పష్టం చేశారు. కాగా, ఇండియా కూటమి పక్షాలకు రాహుల్ ఇచ్చిన తేనీటి విందుకు రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్జేడీ, ఎస్పీ, తృణమూల్, కమ్యూనిస్టు పక్షాల నేతలతో ఆయన ముచ్చటించారు.



నూకపెల్లిలో ఉచిత వైద్య శిబిరం

- 72 మందికి ఉచిత సేవలు

(కళాశ్రీ గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్) అక్టోబర్ 13.

సాయి స్వస్థ్య అర్జెంట్ కేర్ సెంటర్, శ్రీ సత్య సాయి సుజల శ్రావంతి ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నూకపెల్లి గ్రామంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ అవుట్ రీచ్ శిబిరంలో గ్రామానికి చెందిన 72 మంది నిరుపేదలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్ పరీక్షలు, రక్త పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన గ్రామ సర్పంచ్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ ఉషా రాణి లు మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని, సాయి స్వస్థ్య టీమ్ చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ శిబిరంలో డాక్టర్లు చంద్ర వంశీ, వినయ్, శ్రీకాంత్ వూటూరి , వాసు వూటూరి పాల్గొని రోగులకు వైద్య సేవలు అందించారు. నిర్వాహకులు మాట్లాడుతూ – మా సెంటర్ లో అన్ని సేవలు ఉచితం, నో క్యాష్ కౌంటర్ అనే నినాదంతో పేదలకు సేవ చేస్తున్నామని తెలిపారు.



ఎస్ఆర్ఆర్ పీజి రెండవ మరియు నాలుగవ సెమిస్టర్ ఫలితాలు విడుదల

(జక్కుల శ్రీకాంత్, కరీంనగర్, ప్రజా తీర్పు ప్రతినిధి) అక్టోబర్ 13

స్థానిక ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ అటనామస్ కళాశాల పీజీ రెండవ మరియు నాలుగవ సెమిస్టర్ ఫలితాలను కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణ మరియు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య తిరుకోవెల శ్రీనివాస్ మరియు అధ్యాపక బృందంతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణ మాట్లాడుతూ రెండవ సెమిస్టర్ లో 86 శాతం, నాలుగవ సెమిస్టర్ లో 84 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య తిరుకోవెల శ్రీనివాస్ మాట్లాడుతూ ఇది కళాశాల నుండి బయటకు వెళ్తున్న పీజీ మూడవ బ్యాచ్ అని, వారు జీవితంలో అత్యున్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పీ నితిన్, టి రాజయ్య, టీజీసీజీటిఏ అధ్యక్షులు మరియు ఉన్నత విద్య ఐకాస చైర్మన్ డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య తిరుకోవెల శ్రీనివాస్, అదనపు పరీక్షల నియంత్రణ అధికారులు డాక్టర్ తాండ్ర కరుణాకర్, డాక్టర్ ఎం మల్లారెడ్డి, పీజీ సమన్వయకర్త మధు రాజేష్, అకాడమిక్ సమన్వయకర్తలు డాక్టర్ ఏ.శంకరయ్య, డాక్టర్ కట్టా వేణు, ఐక్యూఏసి సమన్వయ హర్ జ్యోత్ కౌర్, స్టాప్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ ఎం శ్రీనివాసరెడ్డి మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.



ఫ్యామిలీ డే, సద్దుల బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించాలి

సేవా సమితి అధ్యక్షురాలు వి రమ

(పొనకంటి ఉపేందర్ రావు ప్రజా తీర్పు ఇల్లందు) అక్టోబర్ 13

ఇల్లందు సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియాలోని వై.సి.ఓ.ఏ క్లబ్‌లో సింగరేణి సేవా సమితి సభ్యులు, ట్రైనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సేవా అధ్యక్షురాలు శ్రీమతి వి. రమ మాట్లాడుతూ, సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఫ్యామిలీ డే అండ్ సద్దుల బతుకమ్మ వేడుకల్లో సేవా సభ్యులు, ట్రైనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.ఇల్లందు ఏరియా జేకే కాలనీలోని గల బ్లాక్ డైమండ్ స్టేడియంలో అక్టోబర్ 18న నిర్వహించనున్న ఫ్యామిలీ డే అండ్ సద్దుల బతుకమ్మ వేడుకలను విజయవంతం చేయాలని సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు శ్రీమతి వి. రమ పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో భాగంగా సేవా సమితి ఆధ్వర్యంలో వివిధ రకాల స్టాల్స్ ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా బతుకమ్మ ఆటపాటలు, కోలాటం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బతుకమ్మ పోటీల్లో ఎంపికైన ఉత్తమ బతుకమ్మలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ఐదు కన్సొలేషన్ బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీనియర్ పర్సనల్ ఆఫీసర్ జి. సుధాకర్, సేవా కార్యదర్శి సులక్షణ, ఇతర సేవా సమితి సభ్యులు, సేవా ట్రైనర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఉప సర్పంచ్ ల ఫోరం చేయూత

(ఎలుక భగవాన్ యాదవ్, ప్రజాతీర్పు, ఎండపల్లి) అక్టోబర్13:



జగిత్యాల జిల్లా ఎండపెల్లి మండల కేంద్రం ఉపసర్పంచ్ దాసరి కళ్యాణి– కొమురయ్య ఇళ్లు విద్యుత్ షాట్ సర్క్యూట్ వల్ల సోమవారం పూర్తిగా దగ్ధమైన విషయం విధితమే. ఇట్టి ప్రమాదం వల్ల సుమారుగా రూ. 20 లక్షల వరకు ఆస్తి నష్టం బాధితులు తెలిపారు. ఈ విషయమై సమాచారం అందుకున్న ఎండపెల్లి మండల ఉపసర్పంచ్ ల పోరం స్పందించి తమ వంతు తక్షణ సాయంగా రూ. 10,000/– వేల ఆర్థిక సహాయాన్ని ఉప సర్పంచ్ ల ఫోరం రాష్ట్ర కార్యదర్శి మేరుగు జంపయ్య (జానీ) ఆధ్వర్యంలో దాసరి కళ్యాణి కుటుంబానికి అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ల పోరం జగిత్యాల జిల్లా అధ్యక్షులు ముత్యాల స్వామి, ఎండపెల్లి మండల అధ్యక్షులు సింహరాజు క్రాంతి, మేడిపెల్లి సత్తయ్య, చెల్పూరి రవిందర్, మల్యాల విజయ– లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం ధరలకు రెక్కలు సామాన్యుడి ఆకలిపై భారం

- రూ.1500 ఉన్న 26 కేజీల బ్యాగ్ కాస్తా రూ.2300కు కిలోకు రూ.25 పెంపు మార్కెట్లో కృత్రిమ కొరత పేదోడి గోస వినేవారెవరు?

(పాష సయ్యద్, ప్రజాతీర్పు వేములవాడ)
అక్టోబర్ 13

అన్నం పెట్టే అన్నపూర్ణకు కరువు వచ్చినట్లుంది. మార్కెట్లో బియ్యం ధరలు చుక్కలను తాకుతున్నాయి. నిన్న మొన్నటి వరకు రూ.1500కి దొరికిన 26 కేజీల సన్న బియ్యం బ్యాగ్ ఇప్పుడు ఏకంగా రూ.2300కు చేరింది. అంటే బ్యాగ్ పై ఏకంగా రూ.800, కిలోకు దాదాపు రూ.30 వరకు పెరిగింది. ఒక్కసారిగా ఈ భారీ పెరుగుదలతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు బతుకు భారమవుతోంది.వేములవాడ పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లోని కిరాణా దుకాణాల్లో, రైస్ డిపోల్లో ధరల పట్టిక చూస్తేనే ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పండుగలు, శుభకార్యాల సీజన్ కావడంతో వ్యాపారులు సిండికేట్ గా ఏర్పడి ధరలను ఇష్టారాజ్యంగా పెంచేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

అకలి తీర్చుకోవడమే కష్టం:

రోజు కూలి చేస్తే రూ.400 వస్తుంది. అందులో రూ.300 బియ్యానికే పోతే ఇక కూరగాయలు, పిల్లల ఫీజు ఎలా?" అంటూ సిరిసిల్లకు చెందిన కూలి కార్మికుడు రాజయ్య ఆవేదన వ్యక్తం చేశారు. "ముందు నెలకు ఒక బ్యాగ్ కొనేవాళ్ళం, ఇప్పుడు 5 కేజీలు, 10 కేజీలు కొంటున్నాం. పూట గడవడం కష్టమవుతోంది అని వాపోయారు. మహిళలు కూడా ఇదే బాధను వ్యక్తం చేస్తున్నారు. "బియ్యం కొనాలంటేనే భయమేస్తుంది. అప్పు చేసి బియ్యం కొంటున్నాం. రేషన్ బియ్యం తప్ప వేరే దారి లేదు అని గృహిణి స్వరూప అన్నారు. చిన్న హోటళ్లు, టిఫిన్ సెంటర్ల పరిస్థితి మరింత దారుణం. బియ్యం ధర పెరగడంతో టిఫిన్ ధరలు పెంచక తప్పడం లేదని, దీంతో కస్టమర్లు తగ్గిపోతున్నారని హోటల్ యజమానులు చెబుతున్నారు.



ధరల పట్టిక - ఒకసారి చూడండి.

బియ్యం రకం	గత ధర (కిలో)	ప్రస్తుత ధర (కిలో)
సన్న బియ్యం (క్వాలిటీ)	రూ. 55 - 60	రూ. 85 - 88
మధ్య రకం సన్న బియ్యం	రూ. 48 - 52	రూ. 70 - 75
దొడ్డు బియ్యం	రూ. 32 - 35	రూ. 42 - 45
26 కేజీల బ్యాగ్	రూ. 1500	రూ. 2300

పెరుగుదలకు కారణాలేంటి?

వ్యాపారులు చెప్పే కారణాలు వేరు, వాస్తవాలు వేరు అని ప్రజలు అంటున్నారు. వర్షాలు తగ్గిపోవడంతో వరి దిగుబడి తగ్గిందని, రవాణా ఛార్జీలు, కూలీలు పెరిగాయని, మిల్లర్లు ధర పెంచారని వ్యాపారులు చెబుతున్నారు. కానీ, స్థానికుల వాదన మరోలా ఉంది. పండుగల సీజన్ ను ఆసరాగా చేసుకుని కొంతమంది పెద్ద వ్యాపారులు బియ్యాన్ని గోదాముల్లో దాచిపెట్టి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం దుకాణాలపై దాడులు చేసి స్టాక్ ను బయటకు తీయాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వం ఏం చేస్తోంది?

ధరల నియంత్రణ విషయంలో అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం సరఫరాను పెంచితే కొంత ఊరట లభిస్తుందని ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా జిల్లా అధికారులు వెంటనే మార్కెట్లో తనిఖీలు చేపట్టి, ఎక్కువ ధరకు అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా వినియోగదారుల మండలి అధ్యక్షులు పాష సయ్యద్ మాట్లాడుతూ ధరలు ఇలాగే పెరుగుతూ పోతే పేదవాడు పూట గడవడం కూడా కష్టమవుతుంది. ప్రభుత్వం స్పందించి బియ్యం ధరలను అదుపులోకి తేవాల్సిన అవసరం ప్రభుత్వం పై ఉందని అన్నారు.

ఎస్సీ వర్గీకరణ ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయాలి

ఎమ్మార్పీఎస్ నేత నక్క సతీష్ మాదిగ

(కుమారస్వామి ప్రజా తీర్పు, జగిత్యాల రూరల్) అక్టోబర్13

ఎస్సీ వర్గీకరణ సాధన కోసం జరిగిన ఉద్యమాల్లో భాగంగా ఎమ్మార్పీఎస్ నాయకులపై నమోదైన కేసులను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఎమ్మార్పీఎస్ నేత నక్క సతీష్ మాదిగ డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం కోసం పోరాడిన ఉద్యమకారులపై కేసులు కొనసాగించడం సరికాదని, ప్రభుత్వం ఈ అంశంపై సానుకూలంగా స్పందించాలని ఆయన కోరారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు 2022లో మల్యాల ఎక్స్‌రోడ్ వద్ద నిర్వహించిన రహదారి దిగ్బంధం కార్యక్రమానికి సంబంధించి నమోదైన కేసు విచారణలో భాగంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మంగళవారం జగిత్యాల కోర్టుకు హాజరయ్యారు. ఈ కేసులో ఎమ్మార్పీఎస్ నాయకులు మీసాల సాయిలు, నక్క సతీష్ మాదిగపై మల్యాల పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ ప్రక్రియలో భాగంగా వారు ఎమ్మార్పీఎస్ తరఫు న్యాయవాది బిరుదుల లక్ష్మణ్తో కలిసి కోర్టుకు హాజరై న్యాయపరమైన ప్రక్రియలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నక్క సతీష్ మాదిగ మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ సాధనలో ఎమ్మార్పీఎస్ చేపట్టిన ఉద్యమాలు కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమాన హక్కుల సాధన కోసం ఉద్యమించిన నాయకులపై నమోదైన కేసులను ప్రభుత్వం పునఃపరిశీలించి వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులపై కేసులు కొనసాగించడం వల్ల వారి పోరాట స్ఫూర్తిని దెబ్బతీయకూడదని, ఎస్సీ వర్గీకరణ కోసం పోరాడిన నాయకులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో భాగంగా ఎమ్మార్పీఎస్ నాయకులపై నమోదైన కేసులన్నింటినీ ఉపసంహరించుకుని, ఉద్యమకారులకు న్యాయం చేయాలని నక్క సతీష్ మాదిగ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.



గొల్లపెల్లి మండలం రంగధాములపల్లిలో అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి

(కుమారస్వామి ప్రజా తీర్పు, జగిత్యాల రూరల్) అక్టోబర్13



జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండలం రంగధామునిపల్లి గ్రామానికి చెందిన రైతు నర్రా రాజిరెడ్డి (55) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం ఉదయం తన ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుడు నర్రా రాజిరెడ్డి, వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్న ఆయన అప్పుల బాధతో ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు ప్రాథమిక సమాచారం. మృతుడి భార్య నర్రా మంగ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొల్లపెల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

యువతకు, ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లకు ఫోటోగ్రఫీ,షార్ట్ ఫిలిమ్ పోటీలకు ఆహ్వానం...

జిల్లా ఎస్పి అశోక్ కుమార్...

(కళాశ్రీ గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్) అక్టోబర్ 13.



శాంతి భద్రతల మరియు సమాజ రక్షణలో తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా పెట్టి, పోరాడి వీరమరణం పొందిన అమర పోలీసుల జ్ఞాపకార్థం అక్టోబర్ 21 నాడు జరుగు " పోలీస్ ఫ్లాగ్ డే " సందర్భంగా పోలీస్ రిలేటెడ్ అంశం మీద ఫోటో గ్రఫీ, షార్ట్ ఫిలిం తీయడానికి జిల్లాలో ఆసక్తి గల యువతక ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లు ముందుకు రావాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.ఇందులో భాగంగా పోలీసుల త్యాగాలు, పోలీసు విధుల్లో ప్రతిభను తెలిపే విధంగా ఉండే తీసిన (3) ఫోటోలు,తక్కువ నిడివి (3 నిమిషాలు) గల షార్ట్ ఫిలిమ్స్ తీసి రాష్ట్రస్థాయి పోటీల కోసం ఈనెల 23 వ తేదీ సాయంత్రంలోగా దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్లో అందజేయాలన్నారు. ఇట్టి షార్ట్ ఫిలిం 3 నిమిషాలు మించకూడదు, 10 ఇ 8 సైజ్ ఫోటోలను, షార్ట్ ఫిలింను పెన్ డ్రైవ్ లో మీ యెక్క పూర్తి వివరాలతో అందజేయలని,జిల్లా స్థాయిలో సెలెక్ట్ అయిన మూడు షార్ట్ ఫిలింలను, ఫొటోలను రాష్ట్ర స్థాయి పోటీల గురించి డీజీపీ ఆఫీస్ హైదరాబాదుకు పంపించడం జరుగుతుందన్నారు.

అంతర్జాతీయ కరాటే పోటీలకు కాకతీయ స్మార్ట్ కిడ్స్ విద్యార్థి ఎంపిక

- శ్రీలంకలో అక్టోబర్ 16, 17 తేదీల్లో పోటీలు
- ఆదిత్య సాయిని అభినందించిన పాఠశాల కరస్పాండెంట్ క్రాంతి కుమార్

(ఇమ్రాన్ జోహ్రా, ప్రజాతీర్పు, కరీంనగర్) అక్టోబర్ 13



అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీలకు కాకతీయ స్మార్ట్ కిడ్స్ పాఠశాలకు చెందిన విద్యార్థి కే. ఆదిత్య సాయి ఎంపికయ్యాడు. శ్రీలంకలో 2026 అక్టోబర్ 16, 17 తేదీల్లో నిర్వహించనున్న ఈ పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కించుకోవడం పట్ల పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ క్రాంతి కుమార్ ఆదిత్య సాయిని అభినందించారు. అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పాఠశాలకు, తల్లిదండ్రులకు గర్వకారణమని పేర్కొన్నారు. క్రీడల పట్ల ఆసక్తి, క్రమశిక్షణ, నిరంతర సాధనతో ఆదిత్య సాయి ఈ స్థాయికి చేరుకోవడం అభినందనీయమని తెలిపారు. అంతర్జాతీయ వేదికపై తన ప్రతిభను చాటుకుని, అద్భుతమైన ప్రదర్శనతో విజయం సాధించి పాఠశాలకు, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆదిత్య సాయికి శుభాకాంక్షలు తెలియజేశారు. కాకతీయ స్మార్ట్ కిడ్స్ పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది కూడా ఆదిత్య సాయిని అభినందిస్తూ, అంతర్జాతీయ కరాటే పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

నెరవేరనున్న దశాబ్దాల కల ఘనంగా భూమి పూజ కార్యక్రమం

(వంజరపు ఎల్లం ప్రజా తీర్పు ప్రతినిధి మాసాయిపేట్) అక్టోబర్ 13

చిన్నశివ్వూర్ గ్రామ ప్రజల దశాబ్దాల నాటి రవాణా కష్టాలకు ఎట్టకేలకు తెరపడింది. గ్రామస్థులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నేషనల్ హైవే ఎన్‌హెచ్44 జాతీయ రహదారి నుండి చిన్నశివ్వూర్ గ్రామానికి అనుసంధానంగా నిర్మించనున్న నూతన రోడ్డు పనులకు భూమి పూజ కార్యక్రమం స్థానిక ప్రజాప్రతినిధులు, మాజీ నాయకులు మరియు గ్రామస్థుల ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించబడింది.రోడ్డు నిర్మాణ స్థలంలో భూమి పూజ నిర్వహించారు. అనంతరం ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు కలిసి కొబ్బరికాయలు కొట్టి, జేసీబీ యంత్రం ద్వారా నూతన రహదారి పనులను ప్రారంభించారు.

హాజరైన ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్థులు

ఈ కార్యక్రమంలో చిన్నశివ్వూర్ గ్రామ సర్పంచ్ సుంచనకోట వరలక్ష్మిస్వామిగౌడ్ , ఉపసర్పంచ్ బొల్ల ప్రశాంత్ పాల్గొని పనులను పరిశీలించారు. వారితో పాటు గ్రామానికి చెందిన వార్డ్ సభ్యులు, మాజీ సర్పంచ్ కోటరీ అశోక్, మాజీ వార్డు సభ్యులు మరియు స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామ ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ రోడ్డు పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని ఈ సందర్భంగా గ్రామ పెద్దలు కోరారు.



ప్రైవేటు మార్కెట్‌లో జోరు..

- పచ్చి ధాన్యానికే రూ.3,200 వరకు ధర
- ప్రైవేటు వ్యాపారుల కొనుగోళ్లు
- కోత కోసిన వెంటనే తూకం

రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులు పచ్చిగానే కొనుగోలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్ సిజన్ అక్టోబర్1వ తేదీ నాటికే ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరుసుకోగా పంట చేతికొచ్చే సమయానికి వ్యాపారులు ముందుగానే రంగంలోకి దిగారు. మండలంలోని నర్సింగ్ రావు పల్లి గ్రామంలో వరి కోతలు జరుగుతుండగా, పంటను కోసిన వెంటనే తూకం వేస్తూ కొనుగోలు చేపట్టారు. ధాన్యం నాణ్యత, పరిస్థితిని బట్టి క్వింటాల్ కు రూ.3200 వరకు చెల్లిస్తున్నట్లు తెలుస్తుంది.లి

నిజాంసాగర్ / అక్టోబర్13(ప్రజా తీర్పు)

సాధారణంగా వరి కోతల అనంతరం ధాన్యాన్ని ఆరబెట్టడం, నిల్ల చేయడం వంటి పనులతో రైతులకు అదనపు శ్రమ, ఖర్చులు ఎదురవుతుంటాయి. అయితే తాండూరు గ్రామంలో ప్రైవేటు వ్యాపారులు పచ్చి ధాన్యాన్నే కొనుగోలు చేస్తుండటంతో రైతులకు వెంటనే విక్రయించుకునే అవకాశం లభిస్తోంది. కొత్త కోసిన



వెంటనే తూకం వేస్తుండటంతో ధాన్యాన్ని ఆరబెట్టేందుకు వేచి ఉండాల్సిన అవసరం తప్పుతోంది. మరోవైపు, కొనుగోళ్ల సమయంలో క్వింటాల్‌కు మూడు కిలోల చొప్పున తరుగు తీసుకుంటున్నట్లు సమాచారం. కొనుగోళ్లు చేసిన ధాన్యం మిల్లులకు చేరిన రెండు రోజుల్లోనే రైతులకు డబ్బులు చెల్లిస్తున్నట్లు పేర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర 'ఏ' గ్రేడ్ రకం సన్నాలకు రూ.2,461గా నిర్ణయించింది. క్వింటాల్‌కు రూ.500 బోనస్‌తో రూ.2,961 వరకు గిట్టుబాటు అవుతుంది. ప్రస్తుతం సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.3,200 చెల్లించడంతో పాటు తడిగా ఉన్నా, హమాలీ, రవాణా తదితర ఖర్చులను రైతులే భరించేలా బేరాలు కుదుర్చుకోవడంతో రైతులకు కొంత ఊరట లభిస్తోందని పేర్కొంటున్నారు.

510 బస్తాలు విక్రయించా

ఖరీఫ్ సీజన్‌లో 9 ఎకరాల్లో సాగు చేశాను. ప్రస్తుతం కొత్త పంట రావడంతో సన్నరకం పచ్చి ధాన్యాన్ని నిజామాబాద్ వ్యాపారికి కళ్లంలోనే అమ్మేశా. 510 బస్తాలను క్వింటాల్‌కు రూ.3,200 చొప్పున విక్రయించాను. ప్రైవేటు వ్యాపారికి ధాన్యం విక్రయించడం వల్ల హమాలీ ఖర్చులు, తరుగు, తూకానికి సంబంధించిన అదనపు ఖర్చులు ఆదా అవుతున్నాయని రైతులు చెబుతున్నారు. నేరుగా మిల్లులకే ధాన్యం విక్రయించడం వల్ల రైతులకు కొంత భారం తగ్గుతోందని పేర్కొంటున్నారు. **బి గోవింద్ విట్టల్ రెడ్డి, నర్సింగ్ రావు పల్లి గ్రామ రైతు**



నూతన బోరు ప్రారంభం.. తీరనున్న నీటి సమస్య

- నూతన బోరు ద్వారా గ్రామ ప్రజలకు అదనపు నీటి సరఫరా

(రాంపెల్లి చంద్రశేఖర్, ప్రజా తీర్పు)
తాండూర్ మండలం రిపోర్టర్) అక్టోబర్ 13

తాండూర్ మండలం మాదారం గ్రామంలో చాలాకాలంగా కొనసాగుతున్న తాగునీటి సమస్యకు పరిష్కారం లభించనుంది. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన నూతన బోరువెల్‌కు మోటారు బిగించి ఆదివారం ప్రారంభించారు. జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి, గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి బోరును ప్రారంభించారు. మాదారం గ్రామంలో నెలకొన్న నీటి సమస్యను కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి దృష్టికి తీసుకెళ్లగా, ఎమ్మెల్యే స్పందించి డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరు చేయించినట్లు సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్ తెలిపారు. మూడు నెలల క్రితం బోరు ఏర్పాటు చేయగా, తాజాగా మోటారు బిగించి నీటి సరఫరాను ప్రారంభించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. మాదారం గ్రామ ప్రజలు చాలాకాలంగా తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా వేసవిలో ఇబ్బందులు మరింత తీవ్రంగా ఉండేవని తెలిపారు. ప్రస్తుతం మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా జరుగుతున్నప్పటికీ, గ్రామ ప్రజల అవసరాలకు సరిపడా నీరు అందకపోవడంతో సమస్య ఏర్పడుతోందన్నారు. నూతన బోరు ద్వారా అదనంగా నీటిని సరఫరా చేయడంతో గ్రామంలోని ప్రతి ఇంటికీ నీరు అందించేందుకు అవకాశం ఏర్పడిందని పేర్కొన్నారు. నీటి సమస్యను ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించడంలో కృషి చేసిన జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డికి, నూతన బోరు ఏర్పాటుకు సహకరించిన ఎమ్మెల్యేకు మాదారం గ్రామ పంచాయతీ ప్రజల తరఫున సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సూరం దామోదర్‌రెడ్డి, వార్డు సభ్యులు గొర్లపల్లి భానేష్, గోదెల లక్ష్మి, మీస లలిత, కత్తెర్ల రవికుమార్, పొట్లం చెర్ల సౌమ్య, గుండేటి లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి శ్రీవాణి, కాంగ్రెస్ నాయకులు పుట్ట శ్రీనివాస్, జోరిగల రమేష్, తోట శ్రీనివాస్, మీస శంకర్, ఆసంపల్లి శ్రీనివాస్, సీపీఐ నాయకులు సముద్రాల ఆనంద్, సిరికొండ సత్యనారాయణ, బొడ్డు సతీష్, రేషన్ డీలర్ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ స్టేషన్ కి వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందించాలి

- గ్రామీణ ప్రాంత ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా అవగాహన కల్పించాలి...
- ముస్తాబద్ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన ఎస్పీ మహేష్ బి. గితే.

(బుగ్గ కృష్ణమూర్తి శర్మ ప్రజా తీర్పు) సిరిసిల్ల, అక్టోబర్ 13

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పోలీస్ స్టేషన్ల పనితీరును మరింత మెరుగుపరిచే దిశగా మంగళవారం ముస్తాబద్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తనిఖీ చేశారు. ఈసందర్భంగా కేసుల పురోగతి, పెండింగ్ దర్యాప్తులు, స్టేషన్ రికార్డులు, సిబ్బంది హాజరు, రౌడీషీటర్లు మరియు నేరస్తులపై నిఘా అంశాలను సమీక్షించి, ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ...వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్ కి వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందేలా బాధ్యతగా మెలగాలని సూచించారు.పోలీస్ స్టేషన్ పరిధిలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని,విధినిర్వహణలో అలసత్వం వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లో వర్టికల్స్ వారీగా విధులు నిర్వర్తించే సిబ్బందిని ఒక్కొక్కరిగా వారి పనితీరు గురించి పరిశీలించారు.ఆధునిక సాంకేతిక వ్యవస్థపై అధికారులు సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని, స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి,ఆన్‌లైన్ మోసాలు, నకిలీ లింకులు, ఓటీపీ మోసాలు, డిజిటల్ అరెస్టుల వంటి సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పిస్తూ అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని,గ్రామీణ ప్రాంతాల్లో రాత్రి సమయాల్లో. పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని,డయల్ 112 కు కాల్ రాగానే పెట్రోలింగ్,బ్లూ కోల్ట్స్ సిబ్బంది తక్షణమే స్పందించి సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు అండగా నిలవాలని సూచించారు.పోలీస్ స్టేషన్లో పనిచేసే అధికారులు,సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఎస్పీ వెంట డిఎస్పీ నాగేంద్రచారి, సిఐ నాగేశ్వరరావు , ఎస్.ఐ జ్యోతి , సిబ్బంది ఉన్నారు.

తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడి గా మాలోత్ కిషన్...

కురవి అక్టోబర్ 13(ప్రజా తీర్పు విలేఖరి)



హైదరాబాద్ లో తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర నాలుగో మహాసభలు జరుగగా,ఆ మహాసభలో మహబూబాబాద్ నుడి మాలోత్ కిషన్ గత పది సంవత్సరాల నుండి గిరిజన సంఘంలో గిరిజనుల హక్కుల కోసం పోరాటం చేస్తూ ఉన్నాడు. ఈ సందర్భంగా మాలోతు కిషన్ మాట్లాడుతూ.. తెలంగాణ గిరిజన సంఘం నూతన రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మాలోత్ కిషన్ మహబూబాబాద్ జిల్లా కురవి మండలం బలపాల శివారు లింగ్య తండకు చెందిన కిషన్ 4 వ మహాసభలో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. రాష్ట్ర మహాసభలు ఉత్తేజపరమైన వాతావరణం లో జరిగాయి.ఈ సందర్భంగా నూతన రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారని,జిల్లాల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై,రానున్న కాలంలో గిరిజన పోరాటాలు నిర్వహిస్తామని,జిల్లాలో ఉన్న అన్ని గిరిజన తెగలు తమ సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ గిరిజన సంఘం ముందుండి పోరాడుతుందని గిరిజన ప్రజలు సమస్యలు పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించాలని సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే పోరాటాల్లో గిరిజన ప్రజలు,గిరిజన అభిమానులు ఈ పోరాటాలకు పూర్తి మద్దతు ఇవ్వాలన్నారు.అలాగే ప్రజలు తమ సమస్యల కోసం గిరిజన సంఘ పోరాటాలను ఉపయోగించుకొని గిరిజన ప్రజల కోసం సంఘం ఎప్పటికీ మీకు అండగా ఉంటుందని గిరిజనులు తమ సమస్యలు పరిష్కారం కోసం గిరిజన సంఘాన్ని సంప్రదించి పోరాటాల్లో పాల్గొనాలని వారన్నారు,రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మాలోత్ కిషన్ గిరిజన సమస్యలపై ఉద్యమాలు నిర్వహిస్తానని ఆయన అన్నారు.కిషన్ ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం,డివైఎఫ్ఎఫ్ఐ, గిరిజన సంఘంలలో గత పది సంవత్సరాల పాటు పోరాటం చేస్తున్నారు.ఐటీడీఏ ఏర్పాటు చేయాలి,ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి, అదనపు సిబ్బంది నియమించాలని వారు అన్నారు.

ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకురాలు కామ్రేడ్ మంజులకు నివాళులు

(పానకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు టేకులపల్లి) అక్టోబర్ 13



ప్రగతిశీల విద్యార్థి సంఘం(పిడిఎస్యు) మాజీ రాష్ట్ర నాయకురాలు ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకురాలు సిపిఐ ఎంఎల్ న్యూడెమెక్రసి కొత్తగూడెం పట్టణ కమిటీ నాయకురాలు కామ్రేడ్ మంజుల అకాల మరణం కు సంతాపం తెలియజేస్తూ మంగళవారం కొత్తగూడెం ఐ ఎఫ్ టి యు ఆఫీస్ లో మంజుల భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించి వారి కుటుంబం కు ప్రగడ సానుభూతి తెలియజేసిన ప్రగతిశీల మహిళా సంఘం (పి ఓ డబ్ల్యూ) జిల్లా గౌరవ అధ్యక్షురాలు సోముల. కళావతి , ప్రగతిశీల యువజన సంఘం (పివై ఎల్) రాష్ట్ర సహాయ కార్యదర్శి సోముల భానుచందర్ నివాళులు అర్పించారు.

సింగరేణి కార్మిక గర్జన సభను విజయవంతం చేయాలి

- బెల్లంపల్లి నుంచి భారీగా తరలిరావాలి: బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

(రాంపెల్లి చంద్రశేఖర్, ప్రజా తీర్పు)
తాండూర్ మండలం రిపోర్టర్) అక్టోబర్ 13



ఈ నెల 14న సాయంత్రం 5 గంటలకు గోదావరిఖనిలో నిర్వహించనున్న సింగరేణి కార్మిక గర్జన భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పిలుపునిచ్చారు. సభ విజయవంతానికి చేపట్టాల్సిన కార్యాచరణపై సోమవారం తాండూర్ మండల సీనియర్ నాయకుడు ఎలుక రామచందర్ నివాసంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గం చిన్నయ్య నాయకులకు పలు సూచనలు చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) ముఖ్య అతిథిగా హాజరుకానున్న నేపథ్యంలో తాండూర్ మండలానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, సింగరేణి కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో తాండూర్ మండల అధ్యక్షుడు సుబ్బ దత్తుమూర్తి, మాజీ ఎంపీపీ మాసాడి శ్రీరాములు,దత్తుమూర్తి, పూసల ప్రణయ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ పేరక రాజన్న, శంకర్, పురుషోత్తం గౌడ్, ఎలుక రామచందర్, నిరంజన్, మద్దిబోయిన అర్జున్, గట్టు సంతోష్, బోడ సతీష్, బాబు ఖాన్, జాడి పోశం, ఉప్పట్ల సంతోష్,లక్ష్మీనారాయణ, గంగారం, సూర్యకిరణ్, సారయ్య, రాకేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించాల్సిందే

- వ్యవసాయ విద్యుత్ సరఫరాలో అంతరాయాలను నివారించాలి
- రైతుల పంటలను కాపాడాలి.. ప్రభుత్వంపై తెలంగాణ రక్షణ సేన నేతల డిమాండ్
- ఎస్ఈ కార్యాలయం ముట్టడికి ముందు ధర్నా

(ఇమ్రాన్ జోహ్రా, ప్రజాతీర్పు, కరీంనగర్) అక్టోబర్ 13

తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మంది రైతులకు 24 గంటల పాటు నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాలని తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో నాయకులు డిమాండ్ చేశారు. వ్యవసాయ విద్యుత్ సరఫరాలో అంతరాయాలను నివారించాలని కోరుతూ కరీంనగర్‌లోని ఎస్ఈ కార్యాలయం ముట్టడికి ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు వ్యవసాయానికి 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రైతులు సాగు చేస్తున్న పంటలకు కీలక సమయంలో నీరు అందేలా ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యుత్ అంతరాయాలతో పంటలకు ముప్పు

రైతు దేశానికి వెన్నెముక అని, రైతులు కష్టపడి పంటలు పండిస్తేనే ప్రజలందరికీ ఆహారం అందుతుందని హరిప్రసాద్ పేర్కొన్నారు. అలాంటి రైతులు వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఎదుర్కోవడం ఆందోళనకరమని



అన్నారు. వ్యవసాయ విద్యుత్ అనేది కేవలం సౌకర్యం మాత్రమే కాదని, రైతుల జీవనాధారానికి, పంటల దిగుబడికి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఎంతో కీలకమని తెలిపారు. వర్షాలు సకాలంలో కురవని పరిస్థితుల్లో బోరుబావులు పంటలకు ప్రధాన నీటి వనరులుగా మారుతున్నాయని, ఈ సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే రైతులు పంటలకు సకాలంలో నీరు అందించలేక ఇబ్బందులు పడతారని పేర్కొన్నారు. విద్యుత్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితుల్లో వ్యవసాయ పనులను ముందస్తుగా ప్రణాళిక చేసుకోవడం కష్టమవుతుందని అన్నారు. పంటలకు అవసరమైన సమయంలో నీరు అందకపోతే మొక్కలు ఎండిపోయి దిగుబడిపై ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పంటలు చేతికి వచ్చే వరకు రైతులు ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొంటారని, విద్యుత్ సమస్యల వల్ల పంట నష్టపోతే పెట్టుబడులు వృథా కావడంతో పాటు కుటుంబ పోషణ, పిల్లల చదువులు, అప్పుల చెల్లింపులపై కూడా ప్రభావం పడుతుందని వివరించారు. అందువల్ల వ్యవసాయ విద్యుత్ సమస్యను రైతుల జీవనోపాధికి సంబంధించిన కీలక అంశంగా ప్రభుత్వం పరిగణించాలని డిమాండ్ చేశారు.

క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరించాలి

తెలంగాణ రక్షణ సేన పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి లింగంపల్లి నాగరాజు మాట్లాడుతూ, రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నామన్న ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని కోరారు. విద్యుత్ నాణ్యత, సరఫరా సమయాలు, తరచూ ఏర్పడుతున్న అంతరాయాల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. రైతులకు అవసరమైన సమయంలో విద్యుత్ అందుబాటులో ఉండేలా పర్యవేక్షణ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలంటే సాగునీరు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, గిట్టుబాటు ధరలతో పాటు నిరంతరాయ విద్యుత్ సరఫరా కూడా అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను రైతులకు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ధర్నాలో పాల్గొన్న నాయకులు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి అంకం శివరాణి, నగర పార్టీ అధ్యక్షుడు రంగరవేణి లక్ష్మణ్ ముదిరాజ్, తెలంగాణ రక్షణ సేన జిల్లా నాయకులు శ్రీరాముల రమేష్, బుడిగె పర్వారం గౌడ్, బసవేణి రాజేందర్, మ్యాక వినోద్, చంటి శ్రీనివాస్, మ్యాకల తిరుపతి, జంగ అపర్ణ, కొత్తూరి నరేష్, జంపాల రీతిష్, అంబాల హరీష్, యండి రాజీ, గర్షకుర్తి విద్యాసాగర్, అబ్దుల్ హఫీజ్, కొత్తూరి రఘు, యండి హుస్సేన్, సిపెళ్ళి వెంకటేష్, మడిపల్లి వినీత్, పూసాల రణధీర్, సూత్రాల రాజన్న, పూసల పవన్, ఉల్లేంగుల నరేష్, నూతి చరణ్, వరుణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఉటూర్ గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య, నేత్ర వైద్య శిబిరం

- గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు.. కంటి ఆరోగ్యంపై అవగాహన
- లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్, రామగుండం సంయుక్తంగా సేవా కార్యక్రమం

(ఇమ్రాన్ జోహ్రా, ప్రజాతీర్పు, కరీంనగర్) అక్టోబర్ 13

లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అక్టోబర్ 8 నుంచి 18 వరకు నిర్వహిస్తున్న విజన్ వీక్ ఆఫ్ సర్వీస్ కార్యక్రమంలో భాగంగా లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్, లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం సంయుక్తంగా కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ఉటూర్ గ్రామంలో ఉచిత వైద్య, నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించాయి. క్లబ్ ట్విన్నింగ్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరం ద్వారా గ్రామీణ ప్రజలకు వైద్య సేవలను అందించడంతో పాటు, కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, దృష్టి లోపాలను ముందుగానే గుర్తించడం, నివారించగల అంధత్వాన్ని అరికట్టడం లక్ష్యంగా సేవలందించారు. శిబిరంలో గ్రామస్థులకు సాధారణ ఆరోగ్య పరీక్షలు, కంటి పరీక్షలు, వైద్యుల సంప్రదింపులు, అవసరమైన ఆరోగ్య సూచనలు అందించారు.

సేవా కార్యక్రమానికి నాయకత్వం

ఈ శిబిరానికి ప్రోగ్రామ్ చైర్మన్ పెద్ది విద్యాసాగర్ నాయకత్వం వహించగా, కోఆర్డినేటర్ ముద్దసాని ప్రదీప్ రెడ్డి, సింగమరాజు, కోల అన్నారెడ్డి, వెంకటాద్రి, డాక్టర్ తుంగూరి కార్తీక్ పాల్గొని తమ సేవలను అందించారు.

మందుల స్పాన్సర్‌గా స్వస్తిక్ మెడికల్ ఏజెన్సీస్

శిబిరానికి అవసరమైన మందులను స్వస్తిక్ మెడికల్ ఏజెన్సీస్ ద్వారా నర్ల సాయికృష్ణ స్పాన్సర్ చేశారు. ఆయన అందించిన సహకారంతో శిబిరానికి హాజరైన రోగులకు అవసరమైన వైద్య సహాయం అందించేందుకు తోడ్పాటు లభించింది. లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ అధ్యక్షుడు మ్యాడం శివకాంత్ పటేల్‌తో పాటు ముక్క శరత్ కృష్ణ, బట్టు వినోద్ పటేల్, మెతుకు కృష్ణ చైతన్య, ఐత సూరజ్ కుమార్, కంభం ప్రసాద్ ఈ సేవా కార్యక్రమానికి సహకారం అందించారు.

ప్రజాసేవే లక్ష్యంగా లయన్స్ క్లబ్‌లు

గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం, కంటి ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, సమాజ శ్రేయస్సు కోసం సేవా కార్యక్రమాలను విస్తరించడం లయన్స్ క్లబ్‌ల ప్రధాన లక్ష్యమని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. లయన్స్ ఇంటర్నేషనల్ ఆశయాలకు అనుగుణంగా ప్రజాసేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని క్లబ్ సభ్యులు తెలిపారు.

కోనరావుపేటలో పంటకు గడ్డి మందు చల్లిన ఘటన.. ఇద్దరు అరెస్ట్

(నారు కట్ల మధు ప్రజా తీర్పు రాజన్న సిరిసిల్ల జిల్లా) అక్టోబర్ 13



భూమి వివాదంలో వరి పంటకు నష్టం.. నిందితులు రిమాండ్‌కు రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామంలో భూ వివాదం నేపథ్యంలో వరి పంటకు గడ్డి మందు చల్లి నష్టం కలిగించిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన ఉప్పుల అంజయ్య 2000 సంవత్సరంలో ఎకరం 20 గుంటల భూమిని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నప్పటికీ మ్యుటేషన్ చేయించుకోలేదు. ధరణి వచ్చిన తర్వాత దరిగె పర్వతాలు, దరిగె పద్మలు ఆ భూమి తమదంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని అంజయ్య ఫిర్యాదు చేశారు. కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటకు గడ్డి మందు చల్లి నష్టం కలిగించారని పేర్కొన్నారు. ఈ ఫిర్యాదుపై కోనరావుపేట ఎస్సై బి. రామ్మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా నిందితులు దరిగె పర్వతాలు, దరిగె పద్మలను పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

ఫిర్యాదులు ఎన్నిసార్లు చేసినా ఫలితం శూన్యం!







ఉదయం

దుండిగల్‌లో రూ.46 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

- కె.వి.ఆర్. వ్యాలీ మెయిన్ రోడ్డుకు మహర్దశ.. మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం: కొలన్ హన్మంత్ రెడ్డి

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 12, ఉదయం:
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని దుండిగల్ డివిజన్ కె.వి.ఆర్. వ్యాలీ మెయిన్ రోడ్డులో రహదారి సమస్యలకు పరిష్కారం లభించనుంది. స్థానికుల విజ్ఞప్తి మేరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ఎమ్మెల్యే నిధుల నుంది రూ.46 లక్షలు మంజూరు చేయించారు. ఈ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం సంగాల్ల మహేందర్ అధ్యక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన రహదారి సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. దుండిగల్ డివిజన్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ, ప్రజలకు అవసరమైన సదుపాయాలను కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రాంత అభివృద్ధికి ప్రజల సహకారంతో ముందుకు సాగుతామని తెలిపారు. ఈ



- టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యంపై ప్రజాగ్రహం

కుత్బుల్లాపూర్, అక్టోబర్ 13, ప్రజాతీర్పు

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు సర్కిళ్లలో టౌన్ ప్లానింగ్ విభాగం పనితీరుపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసినా సంబంధిత అధికారుల వైఖరిలో మార్పు కనిపించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయంటూ పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో అక్రమ నిర్మాణాల కారణంగా ప్రభుత్వ ఆదాయానికి గండిపడటమే కాకుండా, పట్టణ ప్రణాళిక వ్యవస్థపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదులు అందినప్పుడు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు టౌన్ ప్లానింగ్ సిబ్బంది మాత్రం తమకేమీ కాదన్న ధీమాతో వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై ఉన్నతాధికారులు విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది.

ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలి!

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని సర్కిళ్లలో అనుమతులు లేని నిర్మాణాలు, నిబంధనల ఉల్లంఘనలు, పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించే అక్రమాలకు అడ్డుకట్ట వేసి, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే సిబ్బందిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ఫిర్యాదులకు విలువ ఇవ్వకపోతే పట్టణ ప్రణాళిక వ్యవస్థపై నమ్మకం ఎలా నిలుస్తుంది? ఇప్పటికైనా సంబంధిత అధికారులు మేల్కొని, క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, తప్పిదాలు నిర్ధారణ అయిన వారిపై చర్యలు తీసుకుంటారా? లేక ఫిర్యాదులు కాగితాలకే పరిమితం అవుతాయా? అన్నది వేచి చూడాలి.

గీతంలో డిజైన్ థింకింగ్ పై ఎండీపీ

- మూడు రోజుల కార్యక్రమంలో సంస్థాగత సవాళ్ల పరిష్కారానికి శిక్షణ

పటాన్ చేరు, అక్టోబరు 13 ప్రజాతీర్పు ప్రతినిధి

గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ (జీఎస్బీ) లోని వ్యాపార భాగస్వామ్య కేంద్రం (సీబీఈ) ఆధ్వర్యంలో 'సంస్థాగత ఆవిష్కరణ కోసం డిజైన్ థింకింగ్: భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న సంస్థల కోసం మానవ-కేంద్రీకృత సమస్య పరిష్కారం' పేరిట మూడు రోజుల యాజమాన్య వికాస కార్యక్రమం (ఎండీపీ)ని నవంబరు 26 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ కార్యక్రమం, డిజైన్ థింకింగ్ లోని ఐదు దశలైన- సహానుభూతి (ఎంపథైజ్), నిర్వచించడం (డిఫైన్), ఆలోచనలు చేయడం (ఐడియేట్), నమూనా తయారు చేయడం (ప్రోటోటైప్), పరీక్షించడం (టెస్ట్) ద్వారా సంస్థాగత సవాళ్లను పరిష్కరించడానికి అవసరమైన మానవ-కేంద్రీకృత విధానంతో ఇందులో పాల్గొనేవారిని సన్నద్ధం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఇందులో సహానుభూతి మ్యాపింగ్, కస్టమర్ జర్నీ మ్యాపింగ్, సమస్యను గుర్తించడం, పున:రూపకల్పన చేయడం, సృజనాత్మక ఆలోచనలు చేయడం, వేగవంతమైన నమూనా తయారీ, వినియోగదారు పరీక్ష, ఆవిష్కరణ సంస్కృతి, అంతర్గత వ్యవస్థాపకత వంటి కీలక అంశాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాప్ స్టోన్ టీమ్ ఛాలెంజ్, ఆచరణాత్మక కార్యాలయ అనువర్తనాలు కూడా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమం ముగిసేనాటికి, ఇందులో పాల్గొనేవారు డిజైన్ థింకింగ్ ను ఉపయోగించి సంస్థాగత సవాళ్లను పరిష్కరించడం, వినియోగదారు, వాటాదారుల అవసరాలను అర్థం చేసుకోవడం, వినూత్నమైన, ఆచరణాత్మక పరిష్కారాలను రూపొందించడం, నమూనాలను అభివృద్ధి చేసి పరీక్షించడం, వివిధ విభాగాల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడం, సంస్థాగత ఆవిష్కరణ, మార్పును ప్రోత్సహించడం, తమ సంస్థల కోసం ఆచరణీయమైన ఆవిష్కరణ ప్రణాళికలను రూపొందించడం వంటివి చేయగలుగుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ లోని ఎంటర్ ప్రెన్యూర్ షిప్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్, ఏరియా చైర్ డాక్టర్ సుభేందు కుమార్ మిశ్రా, ఆర్గనైజేషనల్ డెవలప్ మెంట్ అండ్ హెచ్ఆర్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తపస్ బంథా సమన్వయకర్తలుగా వ్యవహరిస్తారని తెలియజేశారు. ఇందులో పాల్గొనాలనే ఆసక్తి ఉన్నవారు తమ పేర్ల నమోదు, రుసుము వంటి వివరాల కోసం 96500 89575ను సంప్రదించాలని లేదా ఛఎవఏస్ట్రఱ్ఱుఎ.వఎబకు ఈ-మెయిల్ చేయాలని సూచించారు.



కరీంనగర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరం

(వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్ అక్టోబర్ 13)

లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అక్టోబర్ 8 నుంచి 18 వరకు నిర్వహిస్తున్న విజన్ వీక్ ఆఫ్ సర్వీస్ కార్యక్రమంలో భాగంగా, లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్, లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం సంయుక్తంగా కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ఉటూర్ గ్రామంలో ఉచిత వైద్య, నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించాయి. క్లబ్ ట్విన్నింగ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ శిబిరం ద్వారా గ్రామీణ ప్రజలకు వైద్య సేవలను అందించడంతో పాటు, కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, దృష్టి లోపాలను ముందుగానే గుర్తించడం, నివారించగల అంధత్వాన్ని అరికట్టడం ప్రధాన లక్ష్యాలుగా చేపట్టారు. శిబిరంలో గ్రామస్థులకు సాధారణ ఆరోగ్య , కంటి పరీక్షలు, వైద్యుల సంప్రదింపులు, అవసరమైన ఆరోగ్య సూచనలు అందించారు. ఈ కార్యక్రమానికి ప్రోగ్రామ్ చైర్మన్ పెద్ది విద్యాసాగర్ నాయకత్వం వహించగా, కోఆర్డినేటర్ ముద్దసాని ప్రదీప్ రెడ్డి , సింగమరాజు, కోల అన్నా రెడ్డి వెంకటాద్రి డాక్టర్ తుంగూరి కార్తీక్ పాల్గొని తమ సేవలను అందించారు. శిబిరానికి అవసరమైన మందులను స్వస్తిక్ మెడికల్ ఏజెన్సీస్ ద్వారా నర్ల సాయి కృష్ణ గారు స్పాన్సర్ చేశారు. వారి సహకారం ద్వారా శిబిరానికి హాజరైన రోగులకు అవసరమైన వైద్య సహాయం అందించేందుకు తోడ్పాటు లభించింది.లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ అధ్యక్షులు మ్యాడం శివకాంత్ పటేల్ ముక్క శరత్ కృష్ణ బట్టు వినోద్ పటేల్ మెతుకు కృష్ణ చైతన్య ఐత సూరజ్ కుమార్ కంభం ప్రసాద్ ఈ కార్యక్రమానికి తమ సహకారాన్ని అందించారు. గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం, కంటి ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, సమాజ శ్రేయస్సు కోసం సేవా కార్యక్రమాలను విస్తరించడం లయన్స్ క్లబ్‌ల ప్రధాన లక్ష్యమని ఈ కార్యక్రమం మరోసారి చాటిచెప్పింది. లయన్స్ ఇంటర్నేషనల్ ఆశయాలకు అనుగుణంగా ప్రజాసేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని క్లబ్ సభ్యులు తెలిపారు.

గీతంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

- ఉత్సాహంగా పాల్గొని, తమ సృజనాత్మకతను చాటిన విద్యార్థులు
- ప్రోత్సహించిన అధ్యాపకులు

పటాన్ చేరు, అక్టోబరు 13 ప్రజాతీర్పు ప్రతినిధి



గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులో సోమవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని అందరికీ అవగాహన కల్పించేలా నిర్వహించారు. గీతం స్టూడెంట్ లైఫ్ సహకారంతో, స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్ఎస్) లోని అనువర్తిత మనస్తత్వశాస్త్రం (అప్లైడ్ సైకాలజీ) విభాగం దీనిని ఏర్పాటు చేసింది. 'అవగాహనతో ఉండండి, దయతో ఉండండి, మీలాగే ఉండండి' అనే ఇతివృత్తంతో ఈ మాన సిక ఆరోగ్య కార్యక్రమం 2.0కి రూపకల్పన చేశారు. ఈ కార్యక్రమం 'మెరుగైన మనస్సులు, ఆరోగ్యకరమైన జీవితాలు, మరింత దయగల రేపటి రోజు' అనే దార్శనికతను స్వీకరించి, విద్యార్థులను మానసిక శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇవ్వడానికి, వారి ఆలోచనలు, భావోద్వేగాలను వ్యక్తపరచడానికి, సహాయక వ్యవస్థ లతో అనుసంధానం కావడానికి, శ్రేయస్సు వనరులను అన్వేషించడానికి, సానుభూతి, పరస్పర మద్దతు సంస్కృతిని పెంపొందించడానికి ప్రోత్సహించింది. డాక్టర్ ఎం. రెజా, డైరెక్టర్, స్కూల్ ఆఫ్ సైన్స్, జీఎస్ హెచ్ఎస్ డైరెక్టర్ ఇన్ ఛార్జ్ డాక్టర్ శామ్యూల్ థరుల సమక్షంలో, హ్యుమానిటీస్ డీన్ డాక్టర్ రథిన్ రాయ్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అత్యంత చొరవతో, సృజనాత్మకంగా, ఎంతో నైపుణ్యంతో దీనిని నిర్వహించినందుకు సైకాలజీ విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు స్టాళ్ళను సందర్శించారు. విద్యార్థులతో సంభాషిస్తూ, కార్యక్రమాలు, వాటి ప్రాముఖ్యత గురించి అడిగి తెలుసుకుంటూ, మరింత మెరుగుపరచడానికి విలువైన సూచనలు చేశారు. దీని తరువాత, లలిత, ప్రదర్శన కళల విభాగం అధ్యాపక బృందం, వివిధ విద్యార్థి క్లబ్ లు ఇచ్చిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మానసిక ఆరోగ్య అవగాహన, భావోద్వేగ వ్యక్తీకరణ, ఆత్మపరిశీలన, సామాజిక సంబంధాలను ప్రోత్సహించడానికి రూపొందించిన అనేక రకాల ఆసక్తికరమైన, ముఖాముఖి, సృజనాత్మక కార్యకలాపాలు ఉన్నాయి. వీటిలో మానసిక ఆరోగ్య పజిల్ పీస్ యాక్టివిటీ, మానసిక ఆరోగ్య క్యాసినో, అన్ లాక్ యువర్ మైండ్ మినీ ఎస్కేప్ రూమ్, దాచిన నోట్లతో ఆర్ట్ థెరపీ, క్రాఫ్ట్, ఫోటోబూత్, స్కెచ్ స్టాల్, ఒకటి తీసుకోండి, మరొకటి వదిలేయండి, నిబద్ధత గోడ (కమిట్ మెంట్ వాల్), ధృవీకరణ వాక్యాలు (అఫర్మేషన్ సెంటెన్సెస్), ఒకే ఒక్క కోరిక (వన్ విష్ విల్లో), నా భవిష్యత్తు కోసం ఉత్తరం (లెటర్స్ టు మై ఫ్యూచర్ సెల్ఫ్), మానసిక ఆరోగ్య చెక్-ఇన్ బోర్డు, రంగు విశ్లేషణ, బ్యాడ్జ్ తయారీ, మానసిక అంచనా, మానసిక ఆరోగ్య గళ్ల నుడికట్టు, కోపాన్ని అధిగమించే బెలూన్ పాప్, లాఫింగ్ ఛాలెంజ్ వంటివి ఉన్నాయి. సమిష్టిగా, ఈ కార్యకలాపాలు విద్యార్థులకు వారి భావోద్వేగాలను అన్వేషించడానికి, సమస్యలను ఎదుర్కొనే వ్యూహాలను అభివృద్ధి చేసుకోవడానికి, పరస్పర సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి, సానుకూల మానసిక ఆరోగ్య పద్ధతులను అలవర్చుకోవడానికి తోడ్పడ్డాయి. ఈ కార్యక్రమాన్ని సైకాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రేమ నైటీ జార్జ్, తన సహచర అధ్యాపకుల సహకారంతో సమన్వయం చేశారు. ఈ చొరవ ద్వారా, మానసిక ఆరోగ్యానికి విలువనిచ్చే, సంభాషణలను ప్రోత్సహించే, ప్రతి వ్యక్తి అన్వేషించడానికి, స్వస్థత పొందడానికి, ఇతరులతో మమేకమవ్వడానికి, అభివృద్ధి చెందడానికి సాధికారత కల్పించే సహాయక, సమ్మిళిత ప్రాంగణ వాతావరణాన్ని పెంపొందించాలనే తన నిబద్ధతను గీతం హైదరాబాదు పునరుద్ఘాటించింది.

నిరంతర అభ్యసం అవశ్యం: నిపుణులు

కృత్రిమ మేధస్సు (ఏఐ) యుగంలో నిరంతర అభ్యాసం అవశ్యమని, నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించాలని, శ్రామిక శక్తి పరివర్తన కోసం భవిష్యత్తుకు సిద్ధంగా ఉండే విధానాన్ని అవలంబించాలని పరిశ్రమ నిపుణులు సూచించారు. హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ (జీఎస్బీ) 'మానవ వనరుల (హెచ్ఆర్) విభాగం భవిష్యత్తు-దిశా నిర్దేశం: కార్మిక చట్టాలు, మారుతున్న చట్టాపరమైన పరిస్థితులు' అనే అంశంపై సోమవారం ప్యానెల్ చర్చను నిర్వహించింది. పరిణామం చెందుతున్న కార్మిక చట్టాలు, చట్టపరమైన అనుపాలన, అనిశ్చితి అంచనా, అభివృద్ధి చెందుతున్న మానవ వనరుల పద్ధతులపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి దీనిని లక్ష్యించారు. ఈ చర్చలో ప్రముఖ ప్యానెలిస్టులు- గెయిన్ సైట్ ఇండియా సీనియర్ డైరెక్టర్-కంట్రీ హెడ్ (హెచ్ఆర్) ఇ.హరిత, కార్య ఐటీ సొల్యూషన్స్ డైరెక్టర్ (హెచ్ఆర్) లెర్నింగ్-గ్రోత్ డాక్టర్ శైలజ, ఇన్ ఫోర్ మాజీ సీనియర్ డైరెక్టర్, హెచ్ఆర్ విభాగాధిపతి బి.అనిల్ కుమార్ పాల్గొన్నారు. కొత్త కార్మిక చట్టాల ప్రభావాలు, హెచ్ఆర్ యొక్క అభివృద్ధి చెందుతున్న పాత్రపై విలువైన పరిశ్రమ అంతర్దృష్టులను వారు పంచుకున్నారు. విద్యార్థులు స్వతంత్రంగా ఆలోచించాలని, కృత్రిమ మేధస్సును బాధ్యతాయుతంగా ఉపయోగించాలని సూచించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.ఎన్. రేఖ చర్చను ప్రారంభించగా, కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ కున్మాన్ మిశ్రా కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. ప్యానలిస్టులు ఎంబీఏ, బీబీఏ విద్యార్థులతో కూడా సంభాషించి, వారి సందేహాలను నివృత్తి చేయడంతో పాటు, కొత్తగా వస్తున్న హెచ్ఆర్ సవాళ్లపై ఆచరణాత్మక దృక్పథాలను అందించారు. ఈ చర్చ పరిశ్రమ అనుభవాన్ని అందించడంతో పాటు, మారుతున్న పని ప్రపంచంలో బాధ్యతాయుతమైన నాయకత్వం, వ్యూహాత్మక ఆలోచన, అవగాహనతో కూడిన హెచ్ఆర్ పద్ధతుల ప్రాముఖ్యతను పునరుద్ఘాటించింది.

గుండా మల్లేష్ సేవలు చిరస్మరణీయం

ఘనంగా 6వ వర్ధంతి నివాళులు

(రాంపెల్లి చంద్రశేఖర్, ప్రజా తీర్పు తాండూర్ మండలం రిపోర్టర్) అక్టోబర్ 13



బెల్లంపల్లి నియోజకవర్గ తొలి ఎమ్మెల్యే కామ్రేడ్ గుండా మల్లేష్ ప్రజా సేవలు చిరస్మరణీయమని సీపీఐ తాండూర్ మండల కార్యదర్శి కొండు బానేష్ అన్నారు. మంగళవారం గుండా మల్లేష్ 6వ వర్ధంతిని పురస్కరించుకుని సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. తాండూర్ మండల కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్ ఎదుట గుండా మల్లేష్ స్తూపం, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజానాట్యమండలి కళాకారులతో ర్యాలీ నిర్వహించారు. ఐబీ చౌరస్తా ఫ్లైఓవర్ కింద గుండా మల్లేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళాకారులు విప్లవ గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా బానేష్ మాట్లాడుతూ.. గుండా మల్లేష్ రేచిని గ్రామంలో 1947 జూలై 14న జన్మించారని తెలిపారు. లారీ క్లీనర్‌గా పనిచేస్తూ కార్మికుల సమస్యలపై పోరాటం ప్రారంభించారని చెప్పారు. అనంతరం సింగరేణి కార్మికుడిగా పనిచేస్తూ సీపీఐలో చేరారని తెలిపారు. పేదలు, కార్మికులు, రైతుల సమస్యలపై అనేక పోరాటాలు చేశారని పేర్కొన్నారు. 1978లో తొలిసారి ఎన్నికల్లో పోటీ చేశారని తెలిపారు. మొత్తం ఎనిమిది సార్లు పోటీ చేసి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారని చెప్పారు. బెల్లంపల్లి నియోజకవర్గ తొలి ఎమ్మెల్యేగా సేవలందించారని అన్నారు.గుండా మల్లేష్ నిరాడంబర జీవితం గడిపారని తెలిపారు. పార్టీలకతీతంగా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని చెప్పారు. ఆయన ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి అని బానేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు వాసాల నాగరాజు, పట్టి శంకర్, దాసరి లక్ష్మి, సముద్రాల ఆనంద్, కొండు సాయికుమార్, ఇందారపు రాజేష్, కొడిపాక భాస్కర్, ఎడ్ల గోపాల్, ఎలిగేటి భీమేష్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజానాట్యమండలి కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో ప్రతిభ.. కరీంనగర్ రూరల్ పోలీసులకు ప్రశంసా పత్రాలు

(జక్కుల శ్రీకాంత్ కరీంనగర్ ప్రజా తీర్పు): అక్టోబరు 13



విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీసు అధికారులు, సిబ్బందికి కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయ ఆవరణలో సోమవారం నిర్వహించిన సమీక్షా కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని గుర్తించి ఈ ప్రశంసా పత్రాలు అందజేశారు. కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్ఐ ఎ. లక్ష్మారెడ్డి, కానిస్టేబుళ్లు రవి, అంజయ్య, సాగర్, మహిళా కానిస్టేబుల్ కీర్తన తమ విధి నిర్వహణలో చూపిన ప్రతిభ, అంకితభావం, బాధ్యతాయుతమైన పనితీరును పరిగణనలోకి తీసుకొని ప్రశంసా పత్రాలకు ఎంపిక చేశారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడంతోపాటు విధుల పట్ల నిబద్ధతతో పనిచేసే సిబ్బందిని ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అధికారులు పేర్కొన్నారు. ప్రశంసా పత్రాలు అందుకున్న పోలీసు అధికారులు, సిబ్బందిని కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎ. నిరంజన్ రెడ్డి అభినందించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ విధులు నిర్వహిస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.



ముత్యం రవి మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించిన డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్

నర్సంపేట అక్టోబర్ 13 ప్రజాతీర్పు ప్రతినిధి

వరంగల్ జిల్లా నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని ద్వారకపేట 7వ వార్డులో ముత్యం రవి ముదిరాజ్ అనారోగ్యంతో మృతి చెందగా బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు, నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్ మరియు తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ రవి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నర్సంపేట మండల కార్యదర్శి నూనె రంజిత్ కుమార్ ముదిరాజ్, మారపాక రమేష్ ముదిరాజ్, ముదిరాజ్ కుల సంఘం నాయకులు మిట్టపల్లి శ్రీనివాస్ ముదిరాజ్, నూనె కుమారస్వామి ముదిరాజ్, వేమ స్వామి, సంగినేని జాజనేశ్వర్ ముదిరాజ్, భూసాని శివ కుమార్ ముదిరాజ్, కూరాకుల నవీన్, వేమ కట్టయ్య లతో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



భూముల రీసర్వే ప్రక్రియ వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ గరిమఅగ్రవాల్

(బుగ్గ కృష్ణమూర్తి శర్మ ప్రజా తీర్పు) అక్టోబర్ 13

జిల్లాలో భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. భూముల రీ సర్వే ప్రక్రియ పురోగతిపై జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులతో కలిసి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ జిల్లాలో భూముల రీ సర్వే కొనసాగుతున్న ప్రక్రియపై ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. గ్రామాల సరిహద్దు సర్వే సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, రెవెన్యూ, అటవీ శాఖలు సంయుక్తంగా చేపట్టాలని, భూములకు సంబంధించిన సమాచారం పక్కాగా సేకరించి, నమోదు చేయాలని ఆదేశించారు. సంబంధిత జిల్లా అధికారి, డీఐ లు భూముల రీసర్వే చేపడుతున్న గ్రామాలలో పర్యటించి, ప్రక్రియను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని సూచించారు. లైసెన్సుడ్ సర్వేయర్ల సంఖ్యను పెంచాలని పేర్కొన్నారు. భూములకు సంబంధించిన సమాచారం తప్పులు లేకుండా, పకడ్బందీగా సేకరించాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్ఓ జయశ్రీ, ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కే ఎస్ బీ కుమారి, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, డీఐలు, సర్వేయర్లు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



దసరా నుండి జిల్లాలో పత్తి కొనుగోలు ప్రారంభించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ రెవిన్యూ లక్ష్మీ కిరణ్.

సిద్దిపేట అక్టోబర్ 13 ప్రజా తీర్పు

మంగళవారం ఐడిఓసి సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 9 వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో 23 సీసీఐ కొనుగోలు కేంద్రాల ద్వారా పత్తి కొనుగోలు చేయాలని అన్నారు. పత్తి కొనుగోలు చేసేందుకు అన్ని కొనుగోలు కేంద్రాలలో తూకం యంత్రాలు, తేమ శాతం కలిసి యంత్రాలు సిద్ధం చేయాలని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా కొనుగోలు కేంద్రాల వద్ద త్రాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి దుర్గం ప్రకాష్, జిల్లా వ్యవసాయ అధికారి, జిల్లా తూనికలు మరియు కొలతల అధికారి శివరంజని, సిసిఐ అధికారులు, పత్తి మిల్లర్లు, మార్కెటింగ్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఐఆర్-2026 ప్రక్రియను వేగవంతం చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య

(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) అక్టోబర్ 13

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 2026 లో భాగంగా మ్యాపింగ్ కాని, అనమలిస్ ఓటర్ల నుండి ధ్రువపత్రాల స్వీకరణ, పరిశీలన ప్రక్రియను వేగవంతం చేసి నిర్దిష్ట గడువులోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. మంగళవారం జిల్లాలోని కాసిపేట మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఎస్ ఐ ఆర్ ప్రక్రియ నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ 2026 హియరింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని, ఎన్నికల సంబంధిత పనులలో ఎలాంటి జాప్యం జరగకుండా బూత్ స్థాయి అధికారులు సమన్వయంతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్దేశిత లక్ష్యాలను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని తెలిపారు. మండలంలోని దేవాపూర్ గ్రామపంచాయతీని సందర్శించి గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, పంచాయతీ రికార్డులు, ఇతర పరిపాలనా అంశాలను పరిశీలించారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచడంతో పాటు, గ్రామపంచాయతీ పరిధిలోని రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎస్ఐఆర్ – 2026 ప్రక్రియలో భాగంగా బిఎల్ఓలు సేకరించిన ఎస్ఐఆర్ ఫారాలను క్షుణ్ణంగా ధ్రువీకరించి, సంబంధిత వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఫారాల పరిశీలన, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. విధులలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని తెలిపారు. ఈ-పంచాయతీ పోర్టల్ ద్వారా నిరుద్యోగ యువత నమోదు కోసం అందిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం ధ్రువీకరించి, అర్హులైన వారికి సంబంధిత సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పన్నుల వసూళ్లను లక్ష్యాలకు అనుగుణంగా చేపట్టాలని, పంచాయతీ ఆదాయ వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ, గ్రామ అభివృద్ధి పనులకు అవసరమైన నిధుల సమీకరణపై దృష్టి సారించాలని తెలిపారు. పశు వైద్యశాల సందర్శించి అందిస్తున్న సేవలను పరిశీలించారు. పశుపోషకులకు అవసరమైన పశు వైద్య సేవలు సకాలంలో అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న వి.ఓ. నూతన భవనాలను పరిశీలించి, నిర్మాణ పనులలో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను పూర్తి చేయాలని తెలిపారు. ఈ పర్యటనలో మండల తహసిల్దార్ సునీల్ పాండే, దేవాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ సిడాం రాందాస్, గ్రామ పంచాయతీ అధికారులు, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఉప్పల్లో అధునాతన జీవి మాల్ కొత్త షోరూం గొప్ప ప్రారంభం

(మొక్క ఉపేందర్, ప్రజాతీర్పు ప్రతినిధి హైదరాబాద్) అక్టోబర్ 13



హైదరాబాద్ లోని ఉప్పల్ శాంతినగర్ ప్రధాన రహదారిపై ఉన్న జీవి మాల్ 23వ షోరూం బుధవారం ఎ,్ంనంగా ప్రారంభమైంది. ఈ జీవి మాల్ అండ్ సెలబ్రేషన్ కు సినీనటి భాగ్యశ్రీ బోర్సే, స్థానిక ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, నిర్వాహకులు గుర్రం ఉమామహేశ్వరరావు, గుర్రం వాసు, గుర్రం మురళి ల తో కలిసి ఘనంగా ప్రారంభించారు. సినీనటి వచ్చి జీవిమాల్ ను ప్రారంభించడంతో యువత కేరింతలతో సందడిగా మారింది. ఈ యొక్క మాల్ లో మహిళలు, పురుషులు ఉ పిల్లల కోసం ప్రత్యేకమైన ఫ్యాషన్ కలెక్షన్స్, ప్రారంభమైన ఆఫర్స్ అందుబాటులో ఉండడంతో మాల్ మొత్తం కిక్కిరిసిపోయింది. అధునాతన షాపింగ్ మాల్ జీవి మాల్ ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని నాన ఏమైనా చూస్తులు ఆధునిక ఫ్యాషన్ లతో వినియోగదారులకు మెరుగైన షాపింగ్ అనుభూతులు అందించాలని ఆకాంక్షించారు. ఉప్పల్ ప్రాంతంలోని జీవి షాపింగ్ మాల్ ను సద్వినియోగం చేసుకోవాలని ఆమెకి సందర్భంగా కోరారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన వస్తువులు అందించే ఉద్దేశంతో ఏర్పాటు చేయడం జరిగిందని అందుకు అభినందనీయమని అన్నారు. ఖమ్మంలో ప్రారంభమై 75 ఏళ్ల వస్త్ర ప్రస్థానం, తమ సంస్థ ప్రస్తుతం తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ కర్ణాటక రాష్ట్రాల లలో షోరూం ని కొనసాగిస్తుందని అంటున్నారు నిర్వాహకులు. ప్రజల అభిరుచులకు అనుగుణంగా అంతర్జాతీయ ఫ్యాషన్ ట్రెండ్స్ తో నాణ్యమైన దుస్తులను అందుబాటులో తీసుకొచ్చామని తెలిపారు.

బాణాసంచా దుకాణాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

హుస్నాబాద్ ఏసిపి సదానందం

హుస్నాబాద్ అక్టోబర్ 13 రవీందర్ ప్రజా తీర్పు



దీపావళి పండుగను పురస్కరించుకుని తాత్కాలిక బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేయాలనుకునే వ్యాపారులు తప్పనిసరిగా సిద్దిపేట పోలీస్ కమిషనర్ కార్యాలయం నుండి ముందస్తు అనుమతి మరియు లైసెన్స్ పొందాలని హుస్నాబాద్ ఏసిపి సదానందం స్పష్టం చేశారు. తాత్కాలిక బాణాసంచా దుకాణాల ఏర్పాటుకు సంబంధించిన దరఖాస్తు ఫారమ్‌లను అక్టోబర్ 20వ తేదీలోపు సిపి కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తులో దుకాణం ఏర్పాటు చేసే స్థలానికి సంబంధించిన పూర్తి వివరాలను స్పష్టంగా పేర్కొనాలి. బాణాసంచా విక్రేతలు నిర్దేశిత అగ్నిమాపక భద్రతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలి. ప్రాథమిక అగ్నిమాపక పరికరాలను దుకాణాల వద్ద అందుబాటులో ఉంచాలి.నిబంధనలకు విరుద్ధంగా, అనుమతి లేకుండా ఏర్పాటు చేసే అనధికార బాణాసంచా దుకాణాలపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఏసిపి సదానందం తెలియజేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రమాదాల నివారణకు ప్రజలు, వ్యాపారులు మరియు వేడుకల నిర్వాహకులు పోలీస్ శాఖకు పూర్తిస్థాయిలో సహకరించాలని ఏసిపి సదానందం గారు కోరారు.

ఎల్ నీనోతో వాతావరణం పప్పు

తెలంగాణపై ఎల్ నినో ప్రభావం

(వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్)



రాష్ట్రంలో 2026 నైరుతి ఋతుపవనాల కాలంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు రాష్ట్రంలో సాధారణంగా 740.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 615.5 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. అంటే సాధారణ వర్షపాతంతో పోలిస్తే 17 శాతం లోటు ఏర్పడింది. ఈ పరిస్థితి వ్యవసాయ రంగంపై ఆందోళన కలిగిస్తోంది.వర్షాలు తగ్గడం వల్ల చెరువులు, జలాశయాలు, భూగర్భ జలాలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. పంటలకు అవసరమైన నీరు అందకపోతే దిగుబడులు తగ్గడం, సాగు ఖర్చులు పెరగడం, రైతుల ఆదాయంపై ప్రభావం పడటం వంటి సమస్యలు ఎదురుకావచ్చు.పశువులకు నీరు, పశుగ్రాసం అందుబాటులో ఉండటం కూడా కీలకంగా మారుతుంది.

మరోవైపు, అక్టోబర్‌లోనూ అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటం ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తోంది. వేడి వాతావరణం కొనసాగితే తాగునీటి అవసరాలు పెరగడంతో పాటు విద్యుత్ వినియోగం కూడా అధికమయ్యే అవకాశం ఉంది. భారతదేశంలో వ్యవసాయం ఇప్పటికీ ఋతుపవనాలపై గణనీయంగా ఆధారపడి ఉంది. ఎల్ నినో బలపడిన కొన్ని సంవత్సరాల్లో ఋతుపవనాల వర్షపాతం తగ్గిన సందర్భాలు ఉన్నాయి. అయితే ప్రతి ఎల్ నినో సంవత్సరంలోనూ దేశవ్యాప్తంగా కరువు ఏర్పడుతుందని చెప్పలేం. హిందూ మహాసముద్ర పరిస్థితులు, వాతావరణంలో ఏర్పడే అల్పపీడనాలు, ఇతర గాలుల ప్రభావం కూడా వర్షపాతాన్ని నిర్ణయిస్తాయి.

వర్షాభావం దీర్ఘకాలం కొనసాగితే వరి, పత్తి, మొక్కజొన్న, పప్పుధాన్యాలు వంటి పంటల సాగుపై ప్రభావం పడవచ్చు. ఉత్పత్తి తగ్గితే కొన్ని వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పెరిగే ప్రమాదం ఉంది. అయితే ధరలపై ప్రభావం పంటల ఉత్పత్తి, నిల్వలు, దిగుమతులు, ప్రభుత్వ చర్యలపై కూడా ఆధారపడి ఉంటుంది.

ప్రపంచవ్యాప్తంగా పరిస్థితి ఏమిటి?

ప్రపంచ వాతావరణ సంస్థ అక్టోబర్ 2026లో విడుదల చేసిన అంచనాల ప్రకారం, ప్రస్తుత ఎల్ నినో ఫిబ్రవరి 2027 వరకు కొనసాగేందుకు దాదాపు 100 శాతం అవకాశం ఉందని పేర్కొంది. 1950 నుంచి నమోదైన ఎల్ నినో పరిణామాల్లో ఇది అత్యంత బలమైన వాటిలో ఒకటిగా మారే అవకాశం ఉందని తెలిపింది.ఎల్ నినో ప్రభావంతో దక్షిణాసియాలో వర్షపాతం తగ్గే పరిస్థితులు ఏర్పడవచ్చు. ఆస్ట్రేలియా, ఇండోనేషియా వంటి ప్రాంతాల్లో పొడి వాతావరణం, అగ్నిప్రమాదాల ముప్పు పెరిగే అవకాశం ఉండగా, దక్షిణ అమెరికాలోని కొన్ని ప్రాంతాల్లో అధిక వర్షాలు, వరదలు సంభవించవచ్చు.

ప్రజలు, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ప్రస్తుత పరిస్థితుల్లో నీటి వృథాను అరికట్టడం, అందుబాటులో ఉన్న నీటిని ప్రాధాన్యతల ప్రకారం వినియోగించడం అవసరం. రైతులు వ్యవసాయ శాఖ సూచనల మేరకు పంటలకు నీటి యాజమాన్యాన్ని పాటించాలి. వర్షాభావాన్ని తట్టుకునే పంటల ఎంపిక, తక్కువ నీటితో సాగు పద్ధతులు, నేలలో తేమను కాపాడే చర్యలపై దృష్టి పెట్టాలి. ప్రజలు కూడా తాగునీటిని పొదుపుగా వినియోగించాలి. అధిక వేడి ఉన్న సమయాల్లో బయట తిరగడాన్ని తగ్గించడం, తగినంత నీరు తాగడం, వృద్ధులు, పిల్లల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. ప్రభుత్వ శాఖలు వర్షపాతం, జలాశయాల నిల్వలు, పంటల పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించి అవసరమైన చర్యలు చేపట్టాలి.ఎల్ నినో అనేది సహజమైన సముద్ర--వాతావరణ పరిణామమే అయినప్పటికీ, దాని ప్రభావం వ్యవసాయం, నీటి వనరులు, ప్రజారోగ్యం, ఆర్థిక వ్యవస్థపై పడే అవకాశం ఉంది. తెలంగాణ ఇప్పటికే వర్షపాత లోటును ఎదుర్కొంటున్న నేపథ్యంలో నీటి సంరక్షణ, వ్యవసాయ ప్రణాళిక, ప్రజలకు ముందస్తు సమాచారం అందించడం అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. మొత్తంగా, ఎల్ నినో ప్రభావాన్ని తక్కువగా అంచనా వేయకూడదు; అదే సమయంలో భయాందోళనలకు లోనుకాకుండా శాస్త్రీయ అంచనాలు, ప్రభుత్వ సూచనల ఆధారంగా ముందస్తు చర్యలు చేపట్టడం అవసరం. రానున్న నెలల్లో వాతావరణ పరిస్థితులు ఎలా మారుతాయన్నది ప్రపంచవ్యాప్తంగా రైతులు, ప్రభుత్వాలు, ప్రజలకు కీలకంగా మారనుంది.



ఆద్యరెడ్డి మొదటి పుట్టిన రోజు వేడుకలకి హాజరై చిట్టి తల్లిని ఆశీర్వదించిన,మాజీ సర్పంచ్ అనుముల కుమారస్వామి

నర్సంపేట: అక్టోబర్/13 ప్రజా తీర్పు ప్రతినిధి

చెన్నారావుపేట మండలం ఖాదర్ పేట గ్రామానికి చెందిన కొనుకటి నవీన్ కార్తిక దంపతుల ముద్దుల కూతురు ఆధ్యరెడ్డి మొదటి పుట్టినరోజు సెలబ్రేషన్ ఘనంగా వేడుక జరిపిన తాతా నానమ్మ కుమారస్వామి మంజుల మరియు కేసముద్రం కేంద్ర వాస్తవ్యులు అమ్మమ్మ తాత తోట కోమల సుధాకర్ దంపతుల బంగారు ముద్దుల మనవరాలు ఈరోజు చెన్నారావుపేట కేంద్రంలో మొదటి పుట్టినరోజు వేడుకలు అంగరంగ వైభవంగా జరుగగా ఖాదర్పేట గ్రామ మాజీ సర్పంచ్ అనుముల కుమారస్వామి పుట్టినరోజు వేడుకలకి హాజరై చిట్టితల్లినీ నిండు మనసుతో ఘనంగా ఆశీర్వదించారు.ఈ వేడుక కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కూస రవికుమార్, ముస్కు నర్సిరెడ్డి, కూస రాజు, శిరంశెట్టి వెంకటేష్, సిరిమిళ్ల ప్రదీప్, సింగిరెడ్డి సురేష్ తదితరులు పాల్గొని ఘనంగా ఆశీర్వదించడం జరిగింది.

బొప్పాపూర్ ఏఎంసి చైర్మన్‌గా మేడిపల్లి దేవానందం..

- వైస్ చైర్మన్‌గా నంది కిషన్ నియామకం..

(బుగ్గ కృష్ణమూర్తి శర్మ ఎల్లారెడ్డిపేట, ప్రజా తీర్పు) అక్టోబర్ 13



ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కోరుట్లపేట మాజీ సర్పంచ్,చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డిసిసి అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం తమ్ముడు మేడిపల్లి దేవానందం, నియామకం అయ్యారు.ఎల్లారెడ్డిపేటకు చెందిన నంది కిషన్ ను వైస్ చైర్మన్‌గా నియమిస్తూ గెజిట్ నంబర్ 707 ప్రకారం మంగళవారం రాత్రి అగ్రికల్చర్ ప్రొడక్షన్ కమిషనర్ కె, సురేంద్రమోహన్ ఉత్తర్వులు జారీచేశారు . తమపై నమ్మకంతో ఈ పదవులు కేటాయించిన కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి వారు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, రైతుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ మార్కెట్ కమిటీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని నూతన చైర్మన్ దేవానందంపేర్కొన్నారు.తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.మార్కెట్ కమిటీ సభ్యులుగా... విర్నపల్లి స్వరూప, దండు శ్రీనివాస్, కంచర్ల రాజు, ఎండీ ఇమామ్, మిట్టపల్లి లక్ష్మణ్, బొల్లు గంగయ్య, సిరి పండోల నాగేశ్, సిరిపురం మహేందర్, అంతర్పుల గోపాల్, భూక్య చందర్, ముత్యాల సత్యనారాయణ, అజ్మీరా విశ్వనాథ్‌లను సభ్యులుగా ప్రతిపాదించారు. వీరితో పాటు ఎల్లారెడ్డిపేట పీఏసీఎస్ చైర్మన్, రాజన్నసిరిసిల్ల జిల్లా మార్కెటింగ్ అధికారి, సిరిసిల్ల సహాయ వ్యవసాయ సంచాలకులు, రాచర్ల బొప్పాపూర్ గ్రామ సర్పంచ్‌లు కూడా మార్కెట్ కమిటీ సభ్యులుగా ఉండనున్నారు.



సైకిల్ బ్రాండ్ ఏటా 1,200 కోట్ల అగరబత్తీల ఉత్పత్తి

హైదరాబాద్‌లో సైకిల్ ప్యూర్ కొత్త సువాసనలు ఆవిష్కరణ

(వినోద్, ప్రజా తీర్పు, హైదరాబాద్,) అక్టోబరు 13

అగరబత్తుల తయారీలో 78 ఏళ్ల అనుభవం కలిగిన సైకిల్ ప్యూర్ అగరబత్తి సంస్థ పండుగ సీజన్‌ను పురస్కరించుకుని రాయల్ సీక్రెట్, బన్సారి దర్బార్ పేర్లతో కొత్త సువాసనలను ఆవిష్కరించింది. హైదరాబాద్‌లోని వివాంటాలో నిర్వహించిన మీడియా సమావేశంలో సంస్థ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ అర్జున్ రంగ వీటిని పరిచయం చేశారు. ఏటా 1,200 కోట్లకు పైగా అగరబత్తులను ఉత్పత్తి చేస్తున్న సంస్థ.. దేశవ్యాప్తంగా 5,000 మందికి పైగా పంపిణీదారులు, ఐదు లక్షలకు పైగా రిటైల్ దుకాణాల ద్వారా ఉత్పత్తులను విక్రయిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా 75కుపైగా దేశాలకు ఎగుమతులు చేస్తోంది. హైదరాబాద్‌లోని ప్యాకింగ్ యూనిట్‌లో సుమారు 300 మంది, సుగంధ ద్రవ్యాల తయారీ విభాగంలో 100 మందికి పైగా ఉపాధి పొందుతున్నారు. స్థానికంగా ఉపాధి అవకాశాలను పెంచుతూ, సంప్రదాయ పరిమళాలను ఆధునిక ఆవిష్కరణలతో వినియోగదారులకు అందిస్తున్నామని అర్జున్ రంగ తెలిపారు.

ఆదర్శ్ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ దుర్గా మాత నవరాత్రి ఉత్సవాలు ఘనంగా అన్నదానం మహాప్రసాదం

(మొక్క ఉపేందర్ ప్రజాతీర్పు ప్రతినిధి హైదరాబాద్) అక్టోబర్ 13:



ఆదర్శ్ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ దుర్గా మాత నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు అన్నపూర్ణ దేవి గా కనకదుర్గమాతను అలంకరించడం జరిగింది. అన్నపూర్ణాదేవిగా అవతరణ సందర్భంగా కమిటీ సభ్యులు ఈ అన్నదాన కార్యక్రమాన్ని మోజీజు ఆధ్వర్యంలో ఎంతో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ నాయకులు చామకూర భద్రారెడ్డి, పోచారం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రెడ్డి నాయక్, యువ నాయకులు సామల సందీప్ రెడ్డి, మందడి జగన్మోహన్ రెడ్డి, ఆకిడి బాబ్రెడ్డి, నల్లవెల్లి శేఖర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు వేముల మహేష్ గౌడ్, కాలనీ అధ్యక్షులు బొట్టు రమేష్ గౌడ్, మాజీ అధ్యక్షులు, కానీ ప్రజలందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

మొదలైన వరి కోతలు

- పచ్చి ధాన్యానికి భలే డిమాండ్!
- సన్న రకాల వడ్లకు పెరిగిన ధర.. గ్రామాల్లో దళారుల పాగా
- కళ్లాల వద్దే....కాంటాలు

(బుగ్గ కృష్ణమూర్తి శర్మ , ఎల్లారెడ్డిపేట, ప్రజా తీర్పు) అక్టోబర్ 13



ఎల్లారెడ్డిపేట మండలంలో వరి కోతలు ప్రారంభం కావడంతో ధాన్యం కొనుగోళ్లు ఊపందుకుంటున్నాయి.సన్న బియ్యం ధర క్వింటాలుకు రూ.8 వేల వరకు చేరడంతో సన్న రకాల వడ్లకు డిమాండ్ పెరిగింది. దీంతో కొందరు వ్యాపారులు పచ్చి ధాన్యాన్ని సైతం క్వింటాలుకు రూ.3,400 నుంచి రూ.3,500 వరకు కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. దొడ్డు రకం వడ్లు క్వింటాల్ కు పంట పొలాల వద్ద 2400 రూపాయలు చెల్లించి దళారులు వడ్లను కొనుగోలు చేస్తున్నారు.ఇదే అదనుగా భావిస్తున్న కొందరు ట్రేడ్ లైసెన్సులు లేని దళారులు గ్రామాల్లోకి ప్రవేశించి రైతుల నుంచి తక్కువ ధరలకు ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

కళ్లాల వద్దే తక్కువ ధరకు కొనుగోళ్లు

వరి కోతలు పూర్తయిన వెంటనే ధాన్యాన్ని విక్రయించాలనే తొందరలో ఉన్న రైతుల పరిస్థితిని కొందరు వ్యాపారులు, మధ్యవర్తులు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు కళ్లాల వద్దే క్వింటాలుకు రూ.3,100 చొప్పున ధాన్యం కొనుగోలు చేస్తూ రైతులకు ఆర్థిక నష్టం కలిగిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో లభిస్తున్న ధరకు, కళ్లాల వద్ద చెల్లిస్తున్న ధరకు మధ్య వ్యత్యాసం ఉండటంతో రైతులు నష్టపోతున్నారని పేర్కొంటున్నారు.

అరబెట్టే కష్టాలు.. తేమశాతం ఇబ్బందులు

ధాన్యాన్ని కోసిన తర్వాత ఆరబెట్టడం, తేమశాతం నిర్దేశిత స్థాయికి వచ్చే వరకు వేచి చూడటం రైతులకు భారంగా మారుతోంది. కూలీల ఖర్చులు, వాతావరణ పరిస్థితులు, ధాన్యం నిల్వ చేసేందుకు అవసరమైన సదుపాయాల కొరత వంటి సమస్యలతో కొందరు రైతులు కోత పూర్తయిన వెంటనే పచ్చి ధాన్యాన్ని విక్రయించేందుకు సిద్ధమవుతున్నారురైతుల ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకొని కొందరు రైస్‌మిల్లర్లు, మధ్య దళారులు తక్కువ ధరలకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

అధికారులు స్పందించాలి రైతులను ఆదుకోవాలి.

ట్రేడ్ లైసెన్సులు లేని వ్యాపారులు, మధ్యవర్తుల కొనుగోళ్లపై సంబంధిత అధికారులు నిఘా పెట్టాలని రైతులు కోరుతున్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖ,రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ధాన్యం కొనుగోళ్ల తీరును పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రైతులకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, అక్రమ కొనుగోళ్లు, తక్కువ ధరలకు ధాన్యం కొనుగోలు చేసే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పంట పండించేందుకు నెలల తరబడి శ్రమించిన రైతులు చివరి దశలో దళారుల చేతిలో నష్టపోకుండా అధికారులు తక్షణమే స్పందించాలని అన్నదాతలు ఆశిస్తున్నారు.

పొరుగు జిల్లాలకు ధాన్యం విక్రయిస్తున్న రైతులు

ఎల్లారెడ్డిపేట మండలంలో ఐకెపి మరియు ఫ్యాక్స్ కేంద్రాల ద్వారా కొనుగోలు జరగకపోవడంతో దీనిని ఆశగా చేసుకున్న రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి వారు గతంలో ఎగబెట్టిన కోట (సీఎంఆర్) నింపడం కోసం నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్, ఖమ్మం తదితర పట్టణాల నుండి ఇక్కడికి వచ్చిన దళారులు కొనుగోలు చేసుకుని వెళ్తున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

ఎల్లారెడ్డిపేట మండలంలో ఐకెపి ఫ్యాక్స్ ద్వారా జరగవలసిన కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి వడ్ల కొనుగోలు చేయాలని గొల్లపల్లి సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. లేనిచో రైతులతో మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.



కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటాలకు సిద్ధం కండి

బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం

(వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్ అక్టోబర్ 13)

ఈ నెల 17వ తేదీతో 'సేవా సంకల్ప్ అభియాన్' ముగియనున్న నేపథ్యంలో, పార్టీ నిర్దేశించిన కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసేలా, రాబోయే 50 రోజుల పాటు ప్రజా సమస్యలపై, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై మరింత దూకుడుగా పోరాటాలు నిర్వహించేలా బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం ముఖ్య నేతల సమావేశంలో కీలక దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు మంగళవారం కరీంనగర్ లోని మహాశక్తి దేవాలయ ఆవరణలో పార్టీ ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సాయి ని మల్లేశం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను, ఎన్నికల హామీల వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రజాక్షేత్రంలో నిలబడి ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక రాష్ట్ర స్థాయి సమస్యలపై పోరాటాలు ఉధృతం చేయాలని, అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులు గడుస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఈ వైఫల్యాలను గడపగడపకూ తీసుకెళ్లి ఎండగట్టాలని కోరారు. ఈ నెల 17 తర్వాత రాబోయే 50 రోజుల పాటు అనుసరించాల్సిన వివిధ కార్యక్రమాలు, ఆందోళనలు, ధర్నాలపై నేతలకు స్పష్టమైన ప్రణాళికను వివరించారు. కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేసి చేపట్టబోయే కార్యక్రమాలన్నిటినీ విజయవంతం చేయాలని సూచించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టే ప్రజా ఉద్యమాలకు పార్టీ శ్రేణులంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి ఉపాధ్యక్షులు గుర్రాల వెంకటరెడ్డి కన్న కృష్ణ సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాసరావు వైదరామానుజం చేవూరి సత్యశీ శ్రవణ్ ముత్యాల జగన్ రెడ్డి గుంజేటి శివకుమార్ మైనారిటీ మోర్చా రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్ లతో పాటు బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సంఘ నరేష్ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దివంగత నేత కామ్రేడ్ గుండా మల్లేష్ 6 వ వర్ధంతి

(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) అక్టోబర్ 13

అమరజీవి దివంగత నేత కామ్రేడ్ గుండా మల్లేష్, 6 వ వర్ధంతి కార్యక్రమము భారత కమ్యూనిస్టు పార్టీ మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గం ఆధ్వర్యంలో పట్టణంలోని భగత్ సింగ్ విగ్రహం వద్ద గల గుండ మల్లేష్, విగ్రహానికి పూలమాలవేసి, పట్టణ సిపిఐ కార్యాలయంలో గుండా మల్లేష్, చిత్రపటానికి పూలమాలవేసి పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి అధ్యక్షతన వర్ధంతి సభ నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేణు శంకరు, మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ గారు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి మిట్టపల్లి వెంకటస్వామి గార్లు హాజరై వారు మాట్లాడుతూ అమరజీవి గుండ మల్లేష్, కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతానికి కట్టుబడి పేద ప్రజల సమస్యలపై అలుపెరుగని ప్రజా ఉద్యమాలు నిర్మించి, దున్నేవానికి భూమి చెందాలని భూమిలేని పేదలకు భూమి ఇవ్వాలని, లాకప్ డెత్ లకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించిన మహోన్నతమైన నేత. సామాన్య కుటుంబంలో పుట్టి భారత కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతానికి ఆకర్షితులై బాసెట్టి గంగారం, పోతుగంటి పోశెట్టి గార్లకు ప్రియశిష్యుడై సింగరేణి ఉద్యోగాన్ని వదిలేసి కమ్యూనిస్టు పార్టీలో చేరి అంచలంచలుగా ఎదిగి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా ఎన్నికై ఆసిఫాబాద్ నియోజక వర్గానికి మూడుసార్లు ఎమ్మెల్యేగా నూతనంగా ఏర్పడిన బెల్లంపల్లి నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా మొత్తం నాలుగు సార్లు ఎమ్మెల్యేగా పనిచేశారు. ఈ నియోజకవర్గంలో అనేక ప్రజా సమస్యలను పరిష్కరించి, ఎన్నో ప్రభుత్వ భవనాలను, బెల్లంపల్లి పట్టణానికి బస్టాండ్ను నిర్మింపజేసి, ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలో ఎన్నో ప్రాజెక్టుల గురించి, తుమ్మడి ఎట్టు వద్ద ప్రాజెక్టు నిర్మించాలని ఈ జిల్లాలో సస్యశ్యామలం చేయాలని శాసనసభలో గల మెత్తని నేత. ఎటువంటి అవినీతి లేకుండా నిస్వార్థ జీవితాన్ని గడిపిన మహోన్నతమైన నేత. తన జీవితాన్ని అంతా మరణించేవరకు ప్రజాసేవకే అంకితం చేసిన త్యాగజీవి. ఆయన జీవితాన్ని మనమంతా ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయాన్ని ముందుకు తీసుకుపోవడానికి మనమంతా కృషి చేయాలని అదే ఆయనకు నిజమైన నివాళులని తెలిపినారు. ఈ కార్యక్రమంలో గుండా మల్లేష్, సతీమణి గుండ సరోజన, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బొల్లంపూర్ణిమ, జిల్లా కార్యవర్గ సభ్యులు చిప్ప నరసయ్య, పట్టణ సహాయ కార్యదర్శి బొల్లం తిలక్ అంబేద్కర్, బెల్లంపల్లి మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ , మహిళా సమైక్య జిల్లా అధ్యక్షులు బొల్లం సోని,బి కే ఎం యు జిల్లా కార్యదర్శి గుండ చంద్రమణిక్యం, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు మేకల రాజేశం, జిల్లా సమితి సభ్యులు డిఆర్ శ్రీధర్, రత్నం రాజ్యం, పార్టీనాయకులు స్వామి దాసు, కామర దుర్గయ్య,కే తిరుపతి, జి మహేందర్ రెడ్డి, స్వర్ణలత, చంద్రయ్య, మిట్టపల్లి మల్లేష్, శంకర్, ప్రశాంతి, రవిశంకర్ మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సామాజిక స్ఫూర్తికి ప్రతీక తుడుం శ్రీనివాస్ సేవలు

- తప్పిపోయిన ఆవు.. దూడతో సహా యజమానికి సురక్షితంగా అప్పగింత!

(వినోద్, ప్రజా తీర్పు, ?కేసర) అక్టోబర్ 13

ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న కేసర మండల సామాజిక సేవా కార్యకర్త తుడుం శ్రీనివాస్ మరోసారి తన సేవా గుణాన్ని చాటుకున్నారు. సోషల్ మీడియా ద్వారా తప్పిపోయిన ఆవు ఆచూకీని కనిపెట్టి, దూడతో సహా యజమానికి సురక్షితంగా అప్పగించి అభినందనలు అందుకున్నారు. ?ఘటన వివరాలు: కేసర ఎగ్జిట్ నంబర్ 8 రింగ్ రోడ్ పరిసరాల్లో ఒక ఆవు తప్పిపోగా, అక్కడి సిబ్బంది సుమారు ఎనిమిది గంటల పాటు దాన్ని ఎంతో జాగ్రత్తగా సంరక్షించారు. ఈ సమయంలో ఆవు ఒక దూడకు జన్మనిచ్చింది. సోషల్ మీడియా ప్రచారం: ఈ విషయం తెలుసుకున్న సామాజిక సేవా కార్యకర్త తుడుం శ్రీనివాస్ వెంటనే స్పందించి, ఆవు ఫోటోలను సోషల్ మీడియాలో ప్రచారం చేయడంతో ఆవు యజమాని జహంగీర్‌కు సమాచారం చేరింది. పోలీసుల సహకారం: తుడుం శ్రీనివాస్ ఈ విషయాన్ని కేసర పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా, వారు పత్రాలు మరియు ఆధారాలను పరిశీలించి ఆవు జహంగీర్‌కు చెందినదిగా నిర్ధారించారు. సన్మానం: తన ఆవు, దూడ తిరిగి దొరకడంతో యజమాని జహంగీర్ ఎంతో సంతోషం వ్యక్తం చేస్తూ తుడుం శ్రీనివాస్‌ను శాలువా, పూలదండతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. మూగజీవాల పట్ల ప్రేమ, బాధ్యతను చాటుతూ తుడుం శ్రీనివాస్ అందిస్తున్న ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో స్ఫూర్తిదాయకం. ఈ కార్యక్రమంలో సహకరించిన రింగ్ రోడ్ సిబ్బందికి మరియు కేసర పోలీసులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం ?

- సర్పంచ్‌లకు తెలియకుండానే జాబితాల తయారీ...
- సంతకాలకే రిమితమవుతున్నామంటున్న బీఆర్ఎస్ సర్పంచ్‌లు...
- కురవి మండలంలో ఎంపిక ప్రక్రియపై అభ్యంతరాలు...
- ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో ఇష్టారాజ్యమా...?
- బిఆర్ఎస్ సర్పంచులు ఆవేదన...

కురవి అక్టోబర్ 13 (ప్రజా తీర్పు విలేఖరి)

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన నిరుపేదలకు న్యాయం జరగాలనే ఉద్దేశంతో గ్రామ స్థాయిలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసింది.రాజకీయ పార్టీలకు అతీతంగా,పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలనే లక్ష్యంతో కమిటీలకు బాధ్యతలు అప్పగించింది.అయితే మహబూబాబాద్ జిల్లా కురవి మండలంలోని కొన్ని గ్రామాల్లో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.కమిటీ సభ్యులు,గ్రామ సర్పంచ్‌ల మధ్య సమన్వయం లేకుండానే జాబితాలు సిద్ధం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సర్పంచ్‌లకు సమాచారం లేకుండానే జాబితాలా..?

మండలంలోని కొన్ని గ్రామాల్లో బీఆర్ఎస్‌కు చెందిన సర్పంచ్‌లకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలను సిద్ధం చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అనంతరం ఆ జాబితాలపై సర్పంచ్‌లు సంతకాలు చేయాలని కమిటీ సభ్యులు కోరుతున్నట్లు తెలుస్తోంది.తమకు తెలియకుండా లబ్ధిదారులను ఎలా ఎంపిక చేస్తారని సర్పంచ్ లు ప్రశ్నిస్తున్నారు.దీంతో గ్రామస్థాయిలో ఎంపిక ప్రక్రియపై వివాదాలు తలెత్తుతున్నట్లు తెలుస్తోంది.

'మా ప్రభుత్వం.. మా ఇష్టం' అంటూ ఒత్తిడి చేస్తున్నారు...

కొందరు కమిటీ సభ్యులు తమ ప్రభుత్వ ఆదేశాల మేరకే



లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామని,సర్పంచ్‌లకు వివరించాల్సిన అవసరం లేదన్న ధోరణితో వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ సర్పంచ్‌లు ఆరోపిస్తున్నట్లు సమాచారం. ఎంపిక చేసిన జాబితాలను గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అందజేసి,సర్పంచ్‌ల సంతకాలు తీసుకోవాలని కోరుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.ఈ పరిణామాలతో తమను కేవలం సంతకాలకే పరిమితం చేస్తున్నారని కొందరు సర్పంచ్‌లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.అయితే ఈ ఆరోపణలపై సంబంధిత ఇందిరమ్మ కమిటీ సభ్యులు, అధికారుల వివరణ వెలుగులోకి రావాల్సి ఉంది. ఎంపిక ప్రక్రియలో వాస్తవంగా ఏం జరుగుతోందన్నది అధికారుల విచారణతో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

నిరుపేదలకు న్యాయం జరిగేనా..?

ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంత ఇల్లు లేని నిరుపేదలకు నివాస సదుపాయం కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. అలాంటి పథకంలో అర్హతే ప్రామాణికంగా ఉండాలి తప్ప,రాజకీయ అనుబంధాలు లేదా వ్యక్తిగత ప్రాధాన్యాలకు చోటు ఉండకూడదని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు. కమిటీ సభ్యులు, సర్పంచ్‌లు పరస్పర సమన్వయంతో వ్యవహరిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూడాలని కోరుతున్నారు.

ఎమ్మెల్యే స్పందించాలి.. కలెక్టర్ జోక్యం చేసుకోవాలి

మండలంలోని కొన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే స్పందించి, ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ సర్పంచ్‌లు కోరుతున్నట్లు తెలుస్తోంది.సర్పంచ్‌లు, కమిటీ సభ్యుల మధ్య సమన్వయం ఉండేలా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.అర్హుల ఎంపికపై పూర్తిస్థాయి విచారణ జరిపి, నిబంధ నలకు అనుగుణంగా జాబితాలను పరిశీలించాలని జిల్లా కలెక్టర్‌ను కోరుతున్నారు.తమ అభ్యంతరాలను పరిష్కరించకపోతే జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టే అవకాశముందని సంబంధిత వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ప్రజా పాలనలో సామాజిక న్యాయం అంటే ఇదేనా..?

ప్రభుత్వ పథకాల ఫలాలు నిజమైన లబ్ధిదారులకు చేరాలంటే ఎంపిక ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరి. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో రాజకీయాలకు అతీతంగా అర్హులకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకుంటారా? గ్రామాల్లో నెలకొన్న అభ్యంతరాలకు పరిష్కారం చూపుతారా? అన్నది వేచి చూడాలి.ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించడం లేదని, సంబంధిత సమాచారం ఇవ్వకుండానే ఇష్టానుసారంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారని నారాయణపురం బీఆర్ఎస్ సర్పంచ్ దారావత్ భాస్కర్, ఎలుకచెట్టు తండా సర్పంచ్ గుగులోత్ రమేష్ నాయక్, హరిదాస్ తండా సర్పంచ్ బానోత్ శోభన్ బాబులు ఆరోపించారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులను లబ్ధిదారుల ఎంపికపై ప్రశ్నిస్తే.. "మా ప్రభుత్వం.. మా ఇష్టం.. మా ఎమ్మెల్యే చెప్పినట్లే చేస్తున్నాం" అంటూ సమాధానం చెబుతున్నారని వారు విమర్శించారు.పేదలకు ఇళ్లు అందించాల్సిన పథకంలో రాజకీయ జోక్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. లబ్ధిదారుల ఎంపికలో సర్పంచ్‌ల సంతకాలు అవసరమైనప్పుడు, వారి అభిప్రాయాలకు విలువ ఇవ్వకుండా ఎంపికలు ఎలా చేస్తారని భాస్కర్ ప్రశ్నించారు. సర్పంచ్‌ల సంతకాలే అవసరం లేకపోతే, ఎమ్మెల్యేనే సంతకం చేస్తే సరిపోతుంది కదా? ఇక సర్పంచ్‌ల పాత్ర ఎందుకని ఆయన నిలదీశారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం నిజమైన నిరుపేదలకు అందాలంటే ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా జరగాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులు ఈ వ్యవహారంపై స్పందించి, లబ్ధిదారుల ఎంపికలో అనుసరిస్తున్న విధానాలపై స్పష్టత ఇవ్వాలని వారు కోరారు.



ఓటు చోరీ చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

- గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలి
- సీపీఐ సీనియర్ నేత, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి

హుస్నాబాద్ అక్టోబర్ 13 రవీందర్ ప్రజా తీర్పు

ఓటు చోరీకి సంబంధించిన ఆరోపణలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందించాలని సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి కోరారు. మంగళవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.ఓటు చోరీ అంశంపై ఢిల్లీలో జరుగుతున్న పరిణామాలు, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై వస్తున్న విమర్శల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్పందించాలని చాడ వెంకటరెడ్డి అన్నారు. ఈ అంశంపై వివిధ వర్గాలు నిరసనలు వ్యక్తం చేస్తున్నాయని పేర్కొంటూ, సంబంధిత ఆరోపణలపై సమగ్రంగా స్పందించి ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కోరారు. హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాలను కరీంనగర్ జిల్లాలో కలపాలని చాడ వెంకటరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గతంలో పీసీసీ అధ్యక్షుడి హోదాలో హుస్నాబాద్‌కు పాదయాత్రగా వచ్చిన ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ మేరకు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. హామీ ఇచ్చి మూడేళ్లు గడుస్తున్నప్పటికీ నిర్ణయం అమలులోకి రాలేదని పేర్కొన్నారు. సంబంధిత మండలాలను కరీంనగర్ జిల్లాలో కలిపే ప్రక్రియను ప్రభుత్వం త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఈ అంశాన్ని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఆశించిన నిర్ణయం వెలువడలేదని చాడ వెంకటరెడ్డి తెలిపారు. హుస్నాబాద్ ప్రాంత రైతుల సాగునీటి అవసరాలను తీర్చడంతో పాటు ప్రజలకు తాగునీరు అందించేందుకు గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. 2007లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఈ ప్రాజెక్టుల పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. గండిపల్లి ప్రాజెక్టు పనులు సుమారు 40 శాతం మాత్రమే పూర్తయ్యాయని పేర్కొంటూ, మిగిలిన పనుల పురోగతిపై ప్రభుత్వం దృష్టి సారించాలని అన్నారు.ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ప్రకటనలు చేయడంతో పాటు, అవసరమైన నిధులను కేటాయించి పనులను వేగవంతం చేయాలని సూచించారు. హుస్నాబాద్ ప్రాంతంలో తాగు, సాగునీటి సమస్యల పరిష్కారానికి సీపీఐ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాలు చేపడతామని తెలిపారు. ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికల్లో ఎంప్లాయీస్ యూనియన్‌కు విజయం సాధించిన కార్మికులకు చాడ వెంకటరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల సమస్యలు, హక్కులు, న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.కార్మికుల సమస్యల పరిష్కారంలో జాప్యం జరిగితే సీపీఐ తరపున వారి పక్షాన పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.రాష్ట్రంలో ప్రజా పాలన, ప్రభుత్వ విధానాలను పరిశీలిస్తున్నామని చాడ వెంకటరెడ్డి అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సీపీఐ త్వరలో కార్యాచరణ రూపొందించి పోరాటాలు చేపడుతుందని వెల్లడించారు.ఈ సమావేశంలోసిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి, హుస్నాబాద్ మాజీ వైస్ ఎంపిపి గడిపె మల్లేశ్, హుస్నాబాద్ నియోజకవర్గ సిపిఐ కన్వీనర్ జాగిర్ సత్య నారాయణ, భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ, సిపిఐ మండల సహాయ కార్యదర్శి పొదిల కుమారస్వామి, సిపిఐ మండల నాయకులు పిట్టల మెగిలయ్య, ఎనగందుల లక్ష్మినారాయణ, పిట్టల ప్రసాద్,అయి లేని మల్లారెడ్డి, పిట్టల బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

కంగారూలదే తొలి విజయం

డర్బన్ టెస్టులో ఆసీస్ గెలుపు

సుమారు ఎనిమిదేండ్ల తర్వాత దక్షిణాఫ్రికాలో టెస్టు సిరీస్ ఆడుతున్న ఆస్ట్రేలియా తొలి మ్యాచ్‌లో భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా మంగళవారం డర్బన్‌లో ముగిసిన తొలి టెస్టులో ఆ జట్టు.. 214 పరుగుల తేడాతో సౌతాఫ్రికాను ఓడించి సిరీస్‌లో 1-0 ఆధిక్యం సాధించింది. 421 పరుగుల ఛేదనలో ఆఖరిరోజు ఆరు వికెట్లు చేతిలో ఉండగా ఓవర్‌నైట్ స్కోరు 102/4తో ఆట ఆరంభించిన సఫారీ జట్టు.. 206 పరుగులకే ఆలౌట్ అయింది. మార్‌క్రమ్ (75) ఒక్కడే పోరాడగా ఆఖర్లో మార్కో యాన్సె న్ (110 బంతుల్లో 29) కంగారూల విజయాన్ని కాస్త ఆలస్యం చేశాడు. ఆసీస్ పేసర్ జోష్ హేజిల్‌వుడ్ (6/49) కెరీర్ బెస్ట్ బౌలింగ్ ప్రదర్శనకు సఫారీలు తలవంచక తప్పలేదు. ఈనెల 18 నుంచి రెండో టెస్టు జరుగుతుంది.



బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించాలి

- పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ. వాణీ ప్రసాద్
- బతుకమ్మ వేడుకల ఫొటోలు, వీడియోలతో విస్తృత ప్రచారం కల్పించాలి
- సూపర్ ఎల్‌నినో ప్రభావాలపై బతుకమ్మ పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలి
- పర్యాటక అభివృద్ధి పనులను స్థానిక ఇంజినీరింగ్ శాఖలతో త్వరితగతిన పూర్తి చేయాలి
- ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో ఔట్‌సోర్సింగ్ విధానంలో భద్రతా సిబ్బందిని నియమించాలి

(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) అక్టోబర్ 13

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని పర్యాటక సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ. వాణీ ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో బతుకమ్మ వేడుకల నిర్వహణతో పాటు పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టుల అమలు, నిధుల సమీకరణ, ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ బి. హరి సింగ్ సమీక్షిత జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ. వాణీ ప్రసాద్ మాట్లాడుతూ,లి బతుకమ్మ వేడుకలు గ్రామాలు, పట్టణాల్లో ప్రజల భాగస్వామ్యంతో పండుగ వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సూచించారు. మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. వేడుకలు



జరిగే ప్రదేశాల్లో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ దీపాలు, రవాణా, పార్కింగ్, భద్రత వంటి ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. బతుకమ్మ వేడుకలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను విస్తృతంగా సేకరించి, ప్రచారం చేయాలని కలెక్టర్లకు సూచించారు. బతుకమ్మ పండుగ విశిష్టత, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు ప్రజలకు చేరువయ్యే విధంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు.

బతుకమ్మ పాటల ద్వారా సూపర్ ఎల్‌నినోపై అవగాహన కల్పించాలి

ప్రస్తుత సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వర్షపాతం, నీటి లభ్యత, వ్యవసాయం, పర్యావరణంపై ప్రభావాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎ. వాణీ ప్రసాద్ సూచించారు. బతుకమ్మ పాటల పోటీలను నిర్వహించి, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, నీటిని పొదుపుగా వినియోగించడం వంటి అంశాలు పాటల్లో ప్రతిబింబించేలా కలెక్టర్లు చొరవ తీసుకోవాలన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణమైన సందేశాలతో పాటలు రూపొందించేలా ప్రజలను, మహిళా సంఘాలను, యువతను ప్రోత్సహించాలని తెలిపారు. బతుకమ్మ వేడుకలను సాంస్కృతిక కార్యక్రమాలకే పరిమితం చేయకుండా, ప్రజలకు అవసరమైన అవగాహన కల్పించే వేదికగా కూడా వినియోగించుకోవాలని సూచించారు.

పర్యాటక అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 56 పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులను జిల్లాలకు బదిలీ చేసినట్లు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి తెలిపారు. ఇందులో నాగర్‌కర్నూల్ జిల్లాకు 20, ఖమ్మం జిల్లాకు 12, జగిత్యాల జిల్లాకు 2 ప్రాజెక్టులను అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులను సంబంధిత స్థానిక ఇంజినీరింగ్ శాఖల సమన్వయంతో చేపట్టి, నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలకు బదిలీ చేసిన పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టుల వివరాలను పరిశీలించి, వాటి పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. స్థానిక ఇంజినీరింగ్ శాఖలకు పనుల బాధ్యతలు అప్పగించి, పనుల అమలు, నాణ్యత, పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పనులు పూర్తయిన వెంటనే సంబంధిత బిల్లులను పర్యాటక కార్పొరేషన్‌కు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

రెండు వారాల్లోగా డీపీఆర్ తయారీ బాధ్యతలు అప్పగించాలి

పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులకు అవసరమైన సమగ్ర ప్రాజెక్టు నివేదికలు (డీపీఆర్) సిద్ధం చేసేందుకు తగిన కార్యాచరణ రూపొందించాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సూచించారు. అవసరమైన చోట కన్సల్టెన్సీ సహకారం కూడా అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి జిల్లాలో సంబంధిత ప్రాజెక్టుల డీపీఆర్ తయారీ బాధ్యతలను రెండు వారాల్లోగా ఇంజినీరింగ్ శాఖలకు లేదా తగిన సంస్థలకు అప్పగించాలని ఆదేశించారు. ప్రాజెక్టు పరిధి, భూమి లభ్యత, నిర్మాణ పనులు, అవసరమైన మౌలిక సదుపాయాలు, అంచనా వ్యయం, నిధుల సమీకరణ, అమలు గడువు వంటి అంశాలను డీపీఆర్‌లో స్పష్టంగా పొందుపరచాలని సూచించారు.

హరిత హోటళ్ల పూర్తికి పీపీపీ విధానంలో చర్యలు

కొన్ని జిల్లాల్లో హరిత హోటళ్ల నిర్మాణ పనులు పాక్షికంగా పూర్తయిన నేపథ్యంలో, మిగిలిన పనులను పూర్తి చేసి వాటిని నిర్వహణలోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) విధానంలో అవకాశాలను పరిశీలిస్తున్నట్లు ఎ. వాణీ ప్రసాద్ తెలిపారు. ప్రైవేట్ పెట్టుబడిదారుల సహకారంతో నిర్మాణ పనులను పూర్తి చేసి, నిర్దిష్ట కాలం పాటు నిర్వహణ బాధ్యతలను వారికి అప్పగించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. జిల్లాలలో ఇటువంటి ప్రాజెక్టులకు ఆసక్తి చూపే ప్రైవేట్ పెట్టుబడిదారులు ఉంటే, జిల్లా స్థాయిలో వారిని గుర్తించి ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధుల సహకారం కూడా తీసుకోవాలని సూచించారు.

నిధుల వనరులను పరిశీలించి పర్యాటక ప్రణాళిక రూపొందించాలి

ప్రతి జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలను గుర్తించి, సమగ్ర ప్రణాళికతో పాటు ఆకర్షణీయమైన ప్రజెంటేషన్ సిద్ధం చేయాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సూచించారు. జిల్లాలోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతాలు, చారిత్రక ప్రదేశాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలు, ప్రకృతి అందాలు, వారసత్వ ప్రదేశాలను గుర్తించి, వాటి అభివృద్ధికి అవసరమైన భూమి, మౌలిక సదుపాయాలు, అంచనా వ్యయం, అమలు విధానం, పర్యాటకుల సౌకర్యాలను ప్రణాళికలో పొందుపరచాలన్నారు. పర్యాటక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ నిధులు, కేంద్ర ప్రభుత్వ పథకాలు, స్వచ్ఛంద సంస్థల సహకారం, ప్రైవేట్ పెట్టుబడులు వంటి అన్ని అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. ముఖ్యంగా స్వదేశ్ దర్శన్ పర్యాటక అభివృద్ధి కార్యక్రమం కింద జిల్లాకు అనువైన ప్రాజెక్టులను గుర్తించి, నిధులు సమకూర్చుకునేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. పర్యాటక ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, మరుగుదొడ్లు, పార్కింగ్, వసతి, సమాచార బోర్డులు, భద్రత వంటి సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. స్థానిక కళలు, హస్తకళలు, స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులు, స్థానిక ఆహార సంస్కృతిని పర్యాటకంతో అనుసంధానం చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు పెంపొందించాలన్నారు.

ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో భద్రతా సిబ్బందిని నియమించాలి

రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకుల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎ. వాణీ ప్రసాద్ సూచించారు. ఈ మేరకు జిల్లాలకు పంపిన పర్యాటక ప్రాంతాల జాబితాను పరిశీలించి, అవసరమైన ప్రాంతాల్లో ఔట్‌సోర్సింగ్ విధానంలో భద్రతా సిబ్బందిని నియమించే చర్యలు జిల్లా స్థాయిలో చేపట్టాలని ఆదేశించారు. పర్యాటక ప్రాంతాలకు వచ్చే సందర్శకులకు సురక్షిత వాతావరణం కల్పించడంతో పాటు, సంబంధిత శాఖల సమన్వయంతో పర్యాటక సౌకర్యాలను మెరుగుపరచాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అదనపు కలెక్టర్ బి. హరి సింగ్ అధికారులతో మాట్లాడుతూ, జిల్లాలో బతుకమ్మ పండుగకు అధికారులు అవసరమైన అన్ని ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయాలని ఆదేశాలు జారీ చేశారు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డిఆర్ఓ ప్రేమ్ రాజ్, డిపిఓ యాదగిరి, డిడబ్ల్యుఓ నరసింహారావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు రవితేజ, అనూష, డిఎఎస్డిఓ వెంకటరెడ్డి, అడిషనల్ పిడి సురేష్, జిఎం ఇండస్ట్రీస్ భారతి, తదితరులు పాల్గొన్నారు రెవెన్యూ డివిజన్ అధికారులు, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020